

అన్నవరం ప్రసాదం తయారీ ఇలా..

ప్రసాదం తయారీకి 3:2:1 నిష్పత్తిలో దినుసులు వేస్తుంటారు. 45 లీటర్ల నీటిని ఎక్కువగా మరిగించి ముందుగా 15 కిలోల మర ఆడించిన గోధుమలను అందులో వేస్తారు. అరగంట ఉడికిన తర్వాత 30 కిలోల పంచదారను కళాయిలో పోసి ఉడికిస్తారు. ఆ తర్వాత స్వచ్ఛమైన ఆవునెయ్యిని మిశ్రమం చేసి ఉడికిన తర్వాత యాలకుల పొడి మిశ్రమాన్ని కళాయిలో వేస్తారు. గంటసేపు వంటస్వాములు బాకుతో తిప్పగా ప్రసాదం పూర్తిగా గోధుమరంగులోకి వస్తుంది. అప్పుడు ట్రాలీ తొట్టిల్లో కళాయిల నుంచి డంపు చేస్తారు. ట్రాలీ తొట్టిలో వేసిన తర్వాత మరోసారి యాలికల పొడి మిశ్రమాన్ని వేసి మూడు గంటలపాటు ఉంచుతారు. ఆ తరువాత ప్యాకింగ్ విభాగానికి తీసుకెళతారు.



విస్తరాకుల్లో ప్రసాదం



యాలికుల పొడి చల్లి పక్కన ఉంచిన ప్రసాదం



హస్తకళల ఎగ్జిబిషన్ ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రశాంతి, ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

చేతి వృత్తుల ప్రోత్సాహానికి రాయితీలు : కలెక్టర్

రాజమహేంద్రవరం కల్చరల్/ అర్బన్, ఆగస్టు 31 : ప్రభుత్వం చేతి వృత్తులు, చేనేత కార్మికులను ప్రోత్సహించేందుకు రాయితీలను అందిస్తున్నదని కలెక్టర్ ప్రశాంతి అన్నారు. రాజమహేంద్రవరం జాంపేటలోని శ్రీ ఉమా రామలింగేశ్వరస్వామి ఫంక్షన్ హాలులో హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో గాంధీ శిల్ప బజార్ పేరుతో సెప్టెంబరు 5వ తేదీ వరకూ నిర్వహించే హస్తకళలు, కళాత్మక వస్త్రాల విక్రయ ఎగ్జిబిషన్‌ను శనివారం ప్రారంభించి మాట్లాడారు. నగర ప్రజలతో పాటు పరిసర ప్రాంత వాసులు ఈ కళాత్మకమైన ఉత్పత్తులను కొనుగోలు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం హస్తకళలు, చేనేత ఉత్పత్తుల అభివృద్ధికి ఎనలేని కృషి చేస్తున్నదని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాష్ట్ర హస్త కళాకారుల సంస్థ ఈడీ విశ్వ మాట్లాడుతూ ప్రతి రోజూ ఉదయం 11 నుంచి రాత్రి 9 గంటల వరకూ ఎగ్జిబిషన్ తెరిచే ఉంటుందన్నారు. వివిధ రాష్ట్రాలు, ప్రాంతాల నుంచి వచ్చిన 50 మంది హస్త కళాకారులు ఈ ఎగ్జిబిషన్‌లో స్టాల్స్ ఏర్పాటు చేశారని తెలిపారు.అసిస్టెంట్ డైరెక్టర్ అపర్ణలక్ష్మి, లేపాక్షి రాజమహేంద్రవరం మేనేజర్ మోనిక, సిరాజుద్దీన్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మ్యుటేషన్ రికార్డుల ఆన్‌లైన్‌లో జాప్యం వద్దు

రాజానగరం, ఆగస్టు 31 :మ్యుటేషన్‌కు సంబంధించిన వివ రాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ నమోదు చేయించాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు.రాజానగరం తహసీల్దార్ కార్యాలయాన్ని శనివారం ఆక స్మికంగా సందర్శించారు. కార్యా లయంలోని పలు రికార్డులను పరిశీలించారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసిన పలు అంశాలపై తహశీల్దార్ ఎస్.లక్ష్మీలావణ్యను ఆరా తీశారు. పింఛన్ల పంపిణీ ప్రగతిపై ఎంపీడీవోలతో కలెక్టర్ సమీక్షించారు.

బడులకు సెలవు.. ఎస్‌ఏ-1 పరీక్ష వాయిదా

కోరుకొండ, ఆగస్టు 31 : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా జిల్లావ్యాప్తంగా అన్ని పాఠశాలలకు శనివారం ఆకస్మిక సెలవు ప్రకటించారు. కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశాలతో జిల్లా విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు ఉత్తర్వులు విడుదల చేశారు. దీంతో శనివారం జరగాల్సిన సెల్ఫ్ ఎసెస్‌మెంట్-1లో భాగంగా ప్రాథమిక పాఠశాలలకు గణితం,ఉన్నత పాఠశాలలో జరగాల్సిన ఇంగ్లీషు పరీక్షను వాయిదా వేశారు. తిరిగి ఈ పరీక్షలు 6వ తేదీన నిర్వహిస్తారు.

మెయిన్‌లో..
మునిసిపల్ ఆర్‌డీగా నాగనరసింహారావు 5
నల్లజర్లలో డ్రగ్స్ కలకలం

ఆదివారం ప్రత్యేకం

ఆహా.. అన్నవరం ప్రసాదం



కాకినాడ (ఆంధ్రజ్యోతి)/అన్నవరం :

అమృతం అంటే ఎలా ఉంటుందని ఎవరినైనా అడిగితే అన్నవరం ప్రసాదంలా ఉంటుందంటారు చాలామంది.. అడ్డాకులో వేడివేడిగా ఉండే ప్రసాదాన్ని ఒక్కసారి రుచి చూశారా వదిలిపెట్టరు.. ఎవరు పెడతానన్నా కాదనరు... నోట్లో ఇలా వేసుకుంటే అలా కరిగిపోతుంది. మధ్యప్రదేశ్ నుంచి వచ్చే మల్వరాజ్ గోధుమల ద్వారా తయారు చేసే ఈ ప్రసాదానికి మరేదీ సాటిరాదంటే అతిశయోక్తికాదు. ప్రసాదం తయారీలో రుచి, శుచికి ఎంతో ప్రాధాన్యం ఇస్తారు. అందుకే తాజాగా భారత ఆహార భద్రతా ప్రమాణాల సంస్థ (ఎఫ్ఎస్ఏఐ) గుర్తింపు లభించింది. ఇప్పటికే దీనికి 2019లో ఐఎస్‌వో 22000: 2005 గుర్తింపూ లభించింది. ఏటా రెండు కోట్లకుపైగా ప్యాకెట్లు అమ్ముడవడమే అన్నవరం ప్రసాదం రుచికి నిదర్శనం.

ప్రసాదం చరిత్రకు 133 ఏళ్లు..

అన్నవరం సత్యదేవుడి ఆలయం 1891లో ప్రతిష్ఠితమైంది. అప్పటి నుంచి భక్తులకు గోధుమ రవ్వ ప్రసాదాన్నే అందిస్తున్నారు. అన్నవరం ప్రసాదం అంటే భక్తులకు ఎంత ప్రీతిపాత్రమో చెప్పనక్కర్లేదు. ఉభయ గోదావరి జిల్లాల వాసులు రాజకీయ నాయకులు, ఉన్నతాధికారులు ఎవరిని కలవడానికి వెళ్లినా సత్యదేవుడి ప్రసాదం తీసుకెళ్లి అందించడం సర్వసాధారణం. ప్రసాదంతో వెళితే తలచిన పని త్వరితగతిన పూర్తవుతుందనేది వారి నమ్మకం. ఎందుకంటే అన్నవరం సత్యదేవుడి ప్రసాదానికి నాణ్యత, రుచి, శుచిలో తిరుగులేదు.. భారత ఆహార ప్రమాణాల సంస్థ తాజాగా ఎఫ్ఎస్ఎస్ఏఐ గుర్తింపు నిచ్చింది. ఏటా రెండుకోట్లకుపైగా స్వామివారి ప్రసాదం ప్యాకెట్లను దేవస్థానం విక్రయిస్తోంది. ఒక్క ప్రసాదాల ద్వారా ఏటా రూ.40 కోట్ల ఆదాయం సమకూరుతోంది.

మధ్యప్రదేశ్ నుంచి మల్వరాజ్ గోధుమలు..

అన్నవరం ప్రసాదానికి అసలు అంత రుచి ఎక్కడి నుంచి వస్తోంది, అసలు ప్రసాదం ఎలా తయారు చేస్తారనే సందేహాలు చాలామందికి ఉన్నాయి. కోట్లాది మంది భక్తుల మనసుదోచే అన్నవరం ప్రసాదం తయారీలో దేవస్థానం చాలా జాగ్రత్తలు తీసుకుంటుంది. స్థానికంగా దొరికే దినుసులతో ప్రసాదం చేయదు. అత్యంత నాణ్యమైన వస్తువులను రప్పించి మరీ తయారుచేస్తోంది. ప్రసాదం తయారీలో అత్యంత కీలకమైన గోధుమలను ఏకంగా మధ్యప్రదేశ్ నుంచి మల్వరాజ్ రకం దిగుమతి చేసుకుంటోంది. రత్నగిరి కొండపై గోధుమ నూకగా మర ఆడించడానికి ప్రత్యేక యంత్రాలు వినియోగిస్తారు.



ప్రసాదం తయారుచేసే వంట గది

విస్తరాకులే ఎందుకంటే..

సత్యదేవుడి ప్రసాదం ఇప్పటికీ విస్తరాకుల్లోనే భక్తులకు అందిస్తుంటారు. ప్రస్తుతం సాంకేతికంగా అన్నిరంగాల్లో మార్పులు వచ్చినా సత్యదేవుడి ప్రసాదం మాత్రం ఇతరత్రా ప్యాకింగ్‌ల్లో కాకుండా కేవలం విస్తరాకుల్లో వేసి విక్రయించాలని దేవస్థానం అధికారులు నిర్ణయించారు. ప్యాకింగ్ సమయంలో అత్యంత వేడి కలిగిన ఈ ప్రసాదం విస్తరాకుల్లో వేయగానే ఆవిరి, సుగంధ ద్రవ్యాలతో ఆకు మధురంగా మారుతుంది. అందుకే చాలామంది భక్తులు అన్నవరం స్వామి ప్రసాదాన్ని ఆకుతో నాకేయాలంటూ చలోక్తులు విసురుతుంటారు. ఈ విస్తరాకులను ఏజెన్సీ ప్రాంతం నుంచి తీసుకొస్తారు. విస్తరాకుల డిమాండు మేరకు అన్నవరం దేవస్థానం ఆధ్వర్యంలోనే కాకినాడ జిల్లా శంఖవరం మండలం గొంది గ్రామంలో 40 ఎకరాల్లో విస్తరాకు తోటలు పెంచాలని అధికారులు భావిస్తున్నారు.





ఎఫ్ఎస్ఎస్ఏఐ సర్టిఫికెట్ అందుకుంటున్న ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ (ఫైల్)

- అమృతం.. అన్నవరం ప్రసాదం
- 150 గ్రాములు రూ.20
- ఏటా 2 కోట్ల ప్యాకెట్లు విక్రయాలు
- ఆలయానికి రూ.40 కోట్ల ఆదాయం
- రుచి.. శుచిలో అద్భుతం
- గోధుమ రవ్వతో అదరహో
- బయటచేసినా రాని ప్రసాద రుచి
- రత్నగిరిపై 133 ఏళ్లుగా అదే ప్రసాదం
- తాజాగా ఎఫ్ఎస్ఎస్ఏఐ గుర్తింపు

ఏటా 2 కోట్ల ప్యాకెట్ల అమ్మకాలు..

సత్యదేవుడి ప్రసాదాన్ని లొట్టలేసుకుని తినని భక్తులుండరు. 150 గ్రాముల ప్యాకెట్లను రూ.20కి విక్రయిస్తారు. రోజంతా విక్రయాలు అందుబాటులో ఉంటాయి. ప్రసాదం ప్యాకెట్లు ఏటా 2 కోట్లకుపైగా విక్రయిస్తారు. ఒక్కొక్క ప్రసాదం ప్యాకెట్టు 150 గ్రాముల ఉం డేలా తూనిక లేకుండా హస్తంగరిటతో విస్తరాకుల్లో వేసి 58 మంది ప్యాకింగ్ చేస్తారు. వీటిని బుట్టల్లో 100 ప్యాకెట్ల చొప్పున వేసి మరో 10 మంది కావిడ మోతదారులు ప్రసాదం విక్రయ కేంద్రాలకు తీసుకెళ్తారు. ప్రసాదం భక్తులకు 24 గంటలు అందుబాటులో ఉంచుతారు. ప్రసాదం ప్యాకింగ్ చేసే సమయంలో ప్యాకర్లు తలపై టోపీ చేతులకు గ్లవ్స్ తొడిగి ఎంతో శుచిగా తయారుచేస్తుంటారు. అన్నవరం ప్రసాదం తయారీకి 10 మంది వంటస్వాములు విడతలవారీగా విధులు నిర్వహిస్తారు. వీరంతా కొండపై తయారుచేసిన ప్రసాదాన్ని తిరిగి ఇంటికి వెళ్లి చేసినా రుచి, నాణ్యత రాదంటారు. కేవలం కొండపైనే ప్రసాదం తయారీ విభాగంలో చేస్తేనే సత్యదేవుడి మహిమతో ఇంతటి రుచి వస్తుందని పేర్కొనడం విశేషం.

హోరు వానా.. తలొంచెన్!



తొలిరోజే 96.34 శాతం మందికి పింఛన్లు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

చినుకు పడుతున్నా చలించలేదు.. పింఛన్ల పంపిణీ ఆగిపోలేదు..సీఎం చంద్రబాబు సంకల్ప బలానికి.. జిల్లా అధికారుల నిబద్ధత తోడైంది. వెరసి సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ రికార్డు సృష్టించింది. హోరున వాన కురుస్తున్నా తెల్లవారుజామునే ప్రభుత్వోద్యోగి, ప్రజాప్రతినిధి లబ్ధిదారుడి ఇంటికెళ్లి రూ.4 వేల పింఛను చేతిలో పెట్టారు. ఒక్క రోజులో కాదు.. కేవలం 15 గంటల్లో 96 శాతం మందికిపైగా లబ్ధిదారులకు పింఛను అందించారు. ఉదయం 5.30గంటల సమయానికి రాష్ట్రం లోనే జిల్లా మొదటి స్థానంలో కొనసాగి 6 శాతం మందికి పంపిణీ పూర్తి చేసింది.దీంతో లబ్ధిదారుల కళ్లు ఆనందంతో కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞత చెప్పాయి.

- సచివాలయ సిబ్బంది సంకల్ప బలం
- సాయంత్రానికే నూరు శాతానికి చేరువ
- 100 రోజుల్లో గాడిలో పెట్టిన కూటమి
- వలంటీర్లు లేకున్నా వేగంగా అందజేత
- కేవలం మిగిలింది 3.66 శాతమే
- ఒక రోజు ముందే వృద్ధులకు ఆనందం
- సోమవారమూ పంపిణీ

కోరుకొండ ఫస్ట్..

జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి పింఛన్ల పంపిణీపై వారం నుంచే కసరత్తు ఆరంభించారు. ఒక ప్రణాళిక ప్రకారం ఉద్యోగులకు ఆదేశాలు ఇచ్చారు. ఉదయం 6 గంటల్లోపే రాష్ట్రంలోనే మొదటిగా జిల్లాలోని మొత్తం 512 సచివాలయాలు లాగిన్ అయ్యాయి. 4,857 మంది సిబ్బంది పింఛన్ల పంపిణీ ఆరంభించారు. మొత్తం 2,39,924 పింఛను లబ్ధిదారులకు రూ.102,31,63,500 అందజేయాల్సి ఉండగా రాత్రి 7.55 గంటల సమయానికి 2,31,054 (96.34%) మందికి మొత్తం రూ.98,56,93,500 నగదు అందజేశారు. కోరుకొండ మండలం 97.62 శాతంతో మొదటి స్థానంలో ఉండగా తర్వాతి స్థానాల్లో వరుసగా రంగంపేట (97.44%), రాజానగరం(97.28%) ఉన్నాయి.బ్యాంకు సెలవులు, ఆదివారం కారణాలతో ప్రభుత్వం ఒక రోజు ముందే పింఛను అందజేశారు. దీనికి అనుగుణంగా డీఆర్‌డీఏ పీడీ ఎన్‌వీవీఎస్ మూర్తి అధికారులను సమ న్వయం చేసుకున్నారు.ప్రతి మండలానికి సంబంధించిన గణాంకాలు ఎప్పటికప్పుడు వచ్చేలా ఏర్పాటు చేశారు. మునిసిపల్ కార్పొరేషన్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం ద్వారా సూచనలు జారీ చేశారు. లబ్ధిదారులకు ఒక రోజు ముందుగానే అంటే 30వ తేదీ సాయంత్రమే ఫోన్లు చేసి 31న ఇంటి వస్తున్నాం పింఛన్ ఇస్తాం అందుబాటులో ఉండాలని సూచించారు. ఆదివారం సెలవు కావడంతో మిగిలిన వారికి సోమవారం పింఛను పంపిణీ చేస్తారు.

100 రోజుల సంకల్ప బలం

100 రోజుల్లో పింఛన్లను గాడిలో పెడతాం.. సీఎం చంద్రబాబు చెప్పిన ఈ మాటకు హోరు వాన కూడా తలవంచింది. శుక్రవారం ఉదయం నుంచీ ఆకాశానికి చిల్లు పడిందా అనే చందంగా ఎడతెరిపి లేకుండా వాన పడుతున్న విషయం తెలిసిందే.అయినా యంత్రాంగం ఎక్కడా వెనకడుగు వేయలేదు. శనివారం ఇంటింటికీ వెళ్లి పింఛన్లు ఇచ్చారు.



గౌతమి జీవకారుణ్య సంఘంలో కలెక్టర్

నారాయణపురం సమీపంలో ఉన్న శ్రీ గౌతమి జీవకారుణ్య సంఘంలో కలెక్టర్ పి.ప్రశాంతి వృద్ధులను పలకరించి ఆప్యాయంగా రూ.4 వేల చొప్పున పింఛను అందించారు. ఆశ్రమంలో బాగో గులపై ఆరా తీశారు. కలెక్టర్ స్వయంగా వచ్చి పింఛను అందజేయడం, సదుపాయాలపై ఆరా తీయడంతో పం డుటాకుల్లో ఆనందం కనిపించింది.

పింఛన్ల పంపిణీ సాగిందిలా..

సమయం	శాతం	నగదు
3.38	0.54	0.55
5.25	6.01	6.15
11.40	89.57	91.64
12.10	91.24	93.35
02.10	93.87	96.04
03.10	94.52	96.70
06.10	96.16	98.38

శనివారం తెల్లవారుజామున 3.15 గంటలకే పింఛన్ల పంపిణీ ఆరంభించారు. సాయంత్రం 6 గంటలకు 96.34 శాతం పింఛన్లు పంపిణీ చేశారు.



పింఛన్ ఇస్తున్న మంత్రి దుర్గేష్, మాజీ ఎమ్మెల్యే శేషారావు

కూటమి పేదల ప్రభుత్వం : దుర్గేష్

నిడదవోలు, ఆగస్టు 31 : కూటమి ప్రభుత్వం పేదల పక్షపాతి ప్రభుత్వమని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. నిడదవోలు మండలం సమిశ్రగూడెంలో శనివారం పింఛన్లను పంపిణీ చేశారు.ఒకటో తేదీ ఆదివారం కావడంతో ఒకరోజు ముందుగానే పింఛన్ల పంపిణీ కార్యక్రమం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందన్నారు.సోమవారం కూడా లబ్ధి దారులకు పింఛన్లు అందజేస్తారన్నారు. మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు మాట్లాడుతూ భారీ వర్షాలను సైతం లెక్క చేయకుండా పేదలకు ఇంటి వద్ద పింఛన్లు పంపిణీ చేస్తున్నామన్నారు.

గత వైసీపీ ప్రభుత్వంలో పింఛను సమయం వచ్చిందంటే అదేదో జగన్ మాత్రమే చేస్తున్న పెద్ద క్రతువు మాదిరిగా వారం రోజుల పాటు హడావుడి, గందరగోళం కనిపించేది. వలంటీర్లు లేకుండానే.. సచివా లయ సిబ్బందితో మూడు రోజుల సమయం ఉన్నా కేవలం ఒక్క రోజులోనే నూటికి 97 మందికి పింఛను అందించడంలో కూటమి పాలకులు విజయం సాధించారు. దీంతో పండుటాకులను జగన్ ఉద్దేశపూర్వకంగానే అగచాట్లు పెట్టాడనే నిజం రుజువైంది.

ఫస్ట్ కోరుకొండ.. సెకండ్ రంగంపేట

రంగంపేట : ఎన్టీఆర్ భరోసా ఆగస్టు నెల పింఛన్లు పంపిణీలో రాజానగరం నియోజకవర్గంలోని కోరుకొండ మండలం ప్రథమస్థానంలో నిలిచింది. అనపర్తి నియోజకవర్గంలోని రంగంపేట మండలం ద్వితీయ స్థానంలో నిలిచింది. జిల్లాలో కోరుకొండ మండలం 97.62 శాతం మందికి పింఛన్లు పంపిణీ చేసి ప్రథమస్థానంలో నిలిచింది. రంగంపేట మండలంలో 8925 మంది పింఛనుదారులకు రూ.3,77,48,500లు మంజూరు కాగా మధ్యాహ్నం సమయానికే 8668 పింఛన్లు పంపిణీ చేసి జిల్లాలోనే అత్యధికంగా 97.44 శాతంతో జిల్లాలో ద్వితీయ స్థానంలో నిలిచిందన్నారు. ఆ తరువాత స్థానంలో రాజానగరం మండలం 97.28 శాతంతో మూడో స్థానంలో నిలిచింది.



కొమరిపాలెంలో పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి



కొవ్వూరులో నీట మునిగిన ఫైర్‌స్టేషన్

వీడని ముసురు..

- ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వాన
- సరాసరి 56.7 శాతం వర్షపాతం
- అత్యధికంగా పెరవలిలో 97.0 మి.మీ
- ఎక్కడికక్కడ కంట్రోల్‌రూమ్‌లు

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 31: అల్పపీడన ద్రోణి ప్రభావంతో జిల్లాలో గడచిన 24 గంటల్లో విస్తారంగా వర్షాలు పడుతున్నాయి. ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. జిల్లావ్యాప్తంగా 19 మండలాల్లో 56.7 శాతం వర్షపాతం నమోదైందని వాతవరణ శాఖ తెలిపింది. జిల్లాలో అత్యధికంగా పెరవలి మండలంలో 97 మి.మీ.. అత్యల్పంగా కోరుకొండలో 36. మి.మీ వర్షపాతం నమోదైంది. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖ అధికారి వాసుదేవరావు శనివారం పాఠశాలలకు సెలవు ప్రకటిస్తూ ఉత్తర్వులను జారీ చేశారు. జిల్లాలో 1071.4 మి.మీ వర్షం కురిసింది. నల్లజర్లలో 70.8 మి.మీ, ఉండ్రాజవరంలో 67.2 మి.మీ, అనపర్తి 66.4, బిక్కవోలులో 64.8, రంగంపేటలో 63.8 , తాళ్ళపూడిలో 62.6, రాజానగరం 58.8, కడియంలో 55.2, గోకవరంలో 53.2, రాజమహేంద్రవరం రూరల్‌లో 53.2, నిడదవోలులో 52.4, దేవరపల్లిలో 51.0, రాజమహేంద్రవరంలో 49.4, గోపాలపురంలో 46.6, చాగల్లులో 45.2, కొవ్వూరులో 41.6, సీతానగరంలో 36.2 మి.మీ వర్షం కురిసింది.దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.



నల్లజర్లలో నీట మునిగిన ఆనందనిలయం పరిశీలిస్తున్న తహశీల్దార్ తదితరులు



జిల్లా వ్యాప్తంగా 22 కంట్రోల్ రూమ్‌లు

జిల్లాలో అత్యధికంగా వర్ష హెచ్చరికల నేపథ్యంలో 22 కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ నెం 8977935609 , రాజమహేంద్రవరం ఆర్‌డీవో కార్యాలయంలో కంట్రోల్ రూమ్ 0883-442344, కొవ్వూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ 08813-231488, రాజమహేంద్రవరం తహశీల్దార్ కార్యాలయంలో 9494662219, రాజమహేంద్రవరం రూరల్ తహశీల్దార్ కార్యాలయంలో 0883-2416005, సీతానగరం తహశీల్దారు కార్యాలయంలో 6281867443 , కోరుకొండ తహశీల్దార్ కార్యాలయంలో 9908682953 , గోకవరం తహశీల్దార్ కార్యాలయంలో 9492342353, రాజానగరం తహశీల్దారు కార్యాలయంలో 91826 48034 , రంగంపేట తహశీల్దార్ కార్యాలయంలో 7095239456 , అనపర్తి తహశీల్దార్ కార్యాలయంలో 9000660657 , బిక్కవోలు తహశీల్దార్ కార్యాలయంలో 9866484845 , కడియం తహశీల్దార్ కార్యాలయంలో 7659066699 , కొవ్వూరు తహశీల్దార్ కార్యాలయంలో 7981029003 , తాళ్ళపూడి తహశీల్దార్ కార్యాలయంలో 7569770487 , చాగల్లు తహశీల్దార్ కార్యాలయంలో 9676634787, నిడదవోలు తహశీల్దార్ కార్యాలయంలో 9676253740, ఉండ్రాజవరం తహశీల్దార్ కార్యాలయంలో 9493306893, పెరవలి తహశీల్దార్ కార్యాలయంలో 9849172014, గోపాలపురం తహశీల్దార్ కార్యాలయంలో 7337521367 , దేవరపల్లి తహశీల్దార్ కార్యాలయంలో 9705818045 ,నల్లజర్ల తహశీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నెం 9505132306 నెంబర్లకు వర్షం అధికం కావడం వల్లన ఎదైన సమ్యలు ఏర్పడితే సమాచారం ఇవ్వాలని కలెక్టర్ తెలిపారు.

డొంకరాయి జలాశయం నుంచి..

రెండు గేట్లు ద్వారా 4400 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల

సీలేరు కాంప్లెక్సు పరిధిలోని డొంకరాయి జలాశయం నుంచి రెండు గేట్లు ద్వారా 4,400 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. గత రెండ్రోజులుగా డొంకరాయి జలాశయం ఎగువ ప్రాంతంలో భారీగా వర్షాలు కురుస్తుండడంతో వలసగెడ్డ, మంగంపాడు, వాగుల నుంచి వరద నీరు భారీగా వచ్చి చేరుతోంది. దీంతో జెన్‌కో అధికారులు అప్రమత్తమై జలాశయం నీటిమట్టం ప్రమాద స్థాయి చేరుకోకుండా చర్యలు చేపట్టారు. డొంకరాయి జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 1037 అడుగులు కాగా, 1036 అడుగుల వద్ద నీటిమట్టం క్రమంగా కొనసాగేలా జెన్‌కో అధికారులు చర్యలు చేపడుతున్నారు. జలాశయంలోకి 8 వేల క్యూసెక్కులు ఇన్‌ఫ్లోస్ వస్తుండడంతో 4 వేల క్యూసెక్కులు కెనాల్ ద్వారా పొల్లూరు జలవిద్యుత్ కేంద్రానికి విడుదల చేస్తుండగా, 4400 క్యూసెక్కుల నీటిని జలాశయం రెండు గేట్ల ద్వారా ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. **- మోతుగూడెం**



వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తజనం



స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.21.94 లక్షలు

ఆత్రేయపురం, ఆగస్టు 31: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. వేకువజాము నుంచే స్వామి వారికి సుప్రభాత సేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మి హోమం, బాలబోగం తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించి స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి తిరు వీధుల్లో ఏడు ప్రదక్షిణలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భారీ క్యూలైన్ల ద్వారా స్వామివారిని దర్శించుకున్న భక్తులు తులాభారాలు, కానుకలు సమర్పించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. జోరువానలో భక్తులు తడుచుకుంటూ స్వామివారి వ్రతం ఆచరించారు. కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ సతీమణి వెంకటేశ్వరిదేవి సామాన్య భక్తురాలిగా స్వామిని దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా స్వామి వారి ఒక్కరోజు ఆదాయం రూ.21.94 లక్షలు లభించినట్టు ఉప కమిషనర్, ఈవో భూపతిరాజు కిశోర్ కుమార్ తెలియజేశారు.



ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి.. ఆలయంలో కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ సతీమణి వెంకటేశ్వరిదేవి పూజలు



ద్రాక్షారామ భీమేశ్వర స్వామి దేవస్థానం ఈవోగా అల్లు దుర్గా భవాని

ద్రాక్షారామ, ఆగస్టు 31: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం ద్రాక్షారామ భీమేశ్వరస్వామి దేవస్థానం సహాయ కమిషనర్, కార్యనిర్వాహణాధికారిగా అల్లు వెంకట దుర్గాభవాని నియమితులయ్యారు. ఆమె శనివారం కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆలయ సిబ్బంది పలువురు ఆమెకు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలియజేశారు.



ఆయ్ సినిమా షూటింగ్‌లో రాజ్‌కుమార్



ఆయ్.. నేను గోదారోన్నేనండి!

- సినిమా రంగంలో రాణిస్తున్న కసిరెడ్డి రాజ్‌కుమార్
- ఇటీవల ఆయ్ సినిమాతో ప్రేక్షకులతో గిలిగింతలు

గోదావరి జిల్లాల నుంచి ఎందరో సినిమా రంగంలో అడుగుపెట్టి ఎంతోపేరు ప్రఖ్యాతలు సాధించారు. అలా ఇప్పుడు హాస్యనటుడిగా చిత్రపరిశ్రమలో మంచిపేరు సాధించారు కసిరెడ్డి రాజకుమార్. ఇటీవల వచ్చిన ఆయ్ సినిమాలో గోదావరి యాసలో డైలాగ్స్ అదరగొట్టి ప్రేక్షకులతో నవ్వులు పూయించారు ఈ యువనటుడు. తన తల్లి, తాత వెన్ను తట్టి ప్రోత్సహించి తనలో ఉన్న ఆసక్తిని గమనించి పూర్తి సహకారాన్ని అందించడంతో సినీ రంగంలో మంచి స్థాయికి చేరుకున్నానని చెబుతున్నాడు రాజకుమార్. కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం జె.అన్నవరం గ్రామానికి చెందిన కసిరెడ్డి సీతారామయ్య, గంగా భవాని ఏకైక కుమారుడు రాజ్‌కుమార్. తండ్రి మరణించడంతో రాజ్‌కుమార్ తన తల్లితోపాటు అమ్మమ్మగారి ఊరు అయిన భద్రవరం చేరుకున్నాడు. తాత మాణిక్యం వ్యవసాయ పనులు చేసుకుంటూ భజన పాటలు ఆలపించేవారు. అక్కడే భజన బృందాలు వాయించే హార్మోనియం, వాయిద్యం రాజ్‌కుమార్‌ని ఆకర్షించాయి. ఈ నేపథ్యంలో మ్యూజిక్‌లో డిప్లమా పట్టా పొందాడు. రాజ్‌కుమార్‌లో ఉన్న ఆసక్తిని ముందుగానే గమనించిన తల్లి గంగాభవాని హైదరాబాద్ పంపించి ప్రోత్సహించారు. అలా హైదరాబాద్ వెళ్లిన రాజకుమార్ తన టాలెంట్‌తో సినిమాల్లో రాణించాడు. రాజావారు రాణిగారు, అశోకవనంలో అర్జున కల్యాణం, బెదురులంక 2012, అర్జున ఫాల్గుణతోపాటు పలు సినిమాల్లో కమెడియన్‌గా అలరించాడు రాజ్‌కుమార్. ఇటీవల ఆయ్ సినిమాతో సక్సెస్ సాధించిన ఈ హాస్యనటుడిని ఆంధ్రజ్యోతి పలకరించగా పలు విశేషాలను పంచుకున్నాడు.



ఆయ్ సినిమా విజయం సాధించిన సందర్భంగా రాజ్‌కుమార్‌ను అభినందిస్తున్న జూనియర్ ఎన్టీఆర్



'బ్లడీ మేరీ' చిత్రంలో రాజ్‌కుమార్

ప్రశ్న: సినిమా రంగంలో అవకాశం ఎలా వచ్చింది?
రాజ్‌కుమార్: నాకు చిన్ననాటి నుంచి సినిమాలు అంటే ఇష్టం. రాజావారు రాణిగారు సినిమా దర్శకుడు కోలా రవికిరణ్ సహకారంతో నాకు తొలి చిత్రంలో నటించే అవకాశం వచ్చింది. అలా మొదటగా రాజావారు రాణిగారు సినిమాలో నటించాను. ఆ సినిమాలో చౌదరి క్యారెక్టర్ నాకు మంచి పేరు తెచ్చిపెట్టింది.

ప్రశ్న: ఇప్పటి వరకు ఎన్ని సినిమాల్లో నటించారు?
రాజ్‌కుమార్: ఇప్పటివరకు పది సినిమాల్లో నటించారు. అన్ని పాత్రల్లో నాకు నటన సంతోషాన్నిచ్చింది.

ప్రశ్న: మీ జీవితంలో ఎవరి ప్రోత్సాహం అధికంగా ఉంది.?
రాజ్‌కుమార్: మా తాత మాణిక్యం నన్ను పూర్తిగా ప్రోత్సహించారు. అండగా ఉంటూ నేను సంగీతంలో పట్టా తీసుకోవడంలో సహకరించారు. తాత మరణం అనంతరం మా అమ్మ నువ్వు సినీ రంగంలో మంచిస్థానంలో ఉన్నప్పుడే తాత ఆత్మశాంతిస్తుందని చెబుతూ ఉండేది. ఆమె మాటలే నా జీవితాన్ని మలుపుతిప్పాయి.

ప్రశ్న: మీకు సంతృప్తినిచ్చిన పాత్రలేమిటి?
రాజ్‌కుమార్: నా తొలిచిత్రం రాజావారు రాణిగారు సినిమాలో చౌదరి పాత్ర మంచిపేరు తెచ్చి పెట్టింది. ఇటీవల విడుదలైన ఆయ్ చిత్రంలో హీరో స్నేహితుడిగా సుబ్బు పాత్ర కూడా నాలో ఉన్న ప్రతిభకు మెరుగులుదిద్దింది.

ప్రశ్న: మీ లక్ష్యం ఏమిటి?
రాజ్‌కుమార్ : తక్కువ చిత్రాల్లో నటించినా నాకంటూ సినీరంగంలో ఒక ప్రత్యేక స్థానం ఉండాలి.

ప్రశ్న: కొత్త సినిమాలు ఏం చేస్తున్నారు?
రాజ్‌కుమార్: హీరో విజయ దేవరకొండ సినిమా ఒకటి, ఇంకా రెండు కొత్త సినిమాల్లో నటిస్తున్నాను.

ప్రశ్న: ఆయ్ సినిమా ఇంత విజయం సాధించడం మీకెలా ఉంది?
రాజ్‌కుమార్ : చాలా సంతోషంగా ఉంది.

- ఏలేశ్వరం

అన్నవరం దేవస్థానంలో ప్రసాద్ స్కీం పనులకు రూ 25.32 కోట్లు

త్వరలో ఆర్థికపరమైన అనుమతులు

అన్నవరం, ఆగస్టు 31: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో అభివృద్ధి పనులకు సంబంధించి గత ఎనిమిదేళ్లుగా ఎదురుచూస్తున్న ప్రసాద్ స్కీం నిధుల విషయంలో మరో అడుగు ముందుకుపడింది. ప్రస్తుతం అన్నదాన భవన అవసరం దృష్ట్యా ఈవో రామచంద్రమోహన్ పర్యాటక అధికారులను ప్రసాద్ స్కీం నిధుల విషయం ఎంతవరకు వచ్చిందని శనివారం ఆరాతీశారు. స్కీం నిధులకు అనుమతులు వచ్చాయని, త్వరలో ఆర్థికపరమైన ఉత్తర్వులు వెలువడతాయని, అనంతరం టెండర్లు పిలిచి పనులు మొదలపెట్టవచ్చునని సమాధానమివ్వడంతో మళ్లీ ఆశలు చిగురించాయి. ప్రసాద్ స్కీం పనులను ఈ ఏడాది ఏప్రిల్ నెలలో ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభించినా ఆర్థికపరమైన అనుమతులు ఆలస్యమవుతూనే ఉన్నాయి. తాజాగా 25.32 కోట్లకు అనుమతులురాగా త్వరలో ఆర్థికపరమైన ఉత్తర్వులు వస్తాయని టూరిజం అధికారులు పేర్కొన్నారని సమాచారం. వీటితో అన్నదాన భవనం, క్యూకాంప్లెక్స్, ఎలక్ట్రికల్ బస్సులు, చార్జింగ్ స్టేషన్‌లు ఏర్పాటుకు అనుమతులు లభించాయి. కాగా మోదీ వర్చువల్ ప్రారంభోత్సవంలో రూ.20.62 కోట్ల పనులని ప్రకటించగా రూ.25.32 కోట్లు అని తెలపడంతో ఆలయ అధికారులు కొంత సందిగ్ధంలో పడ్డారు.

మునిసిపల్ ఆర్డీగా నాగనరసింహరావుకు పూర్తి బాధ్యతలు

కార్పొరేషన్(కాకినాడ)/రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 31: రాజమహేంద్రవరం మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ రీజనల్ డైరెక్టర్ (ఎఫ్ఏసీ)గా విధులు నిర్వహిస్తున్న కాకినాడ నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ సీహెచ్ నాగనరసింహరావుకు పూర్తి బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. నాగనరసింహరావు కాకినాడ అడిషనల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తూ మునిసిపల్ ఆర్డీగా కూడా అదనపు బాధ్యతలు నిర్వహించారు. అయనను రాజమహేంద్రవరం మునిసిపల్ ఆర్డీగా పూర్తి బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం బదిలీచేసింది. అంతకుముందు కాకినాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్‌గా ఐదేళ్లు పనిచేశారు. ఈ ఐదేళ్లలో ఆయన ఎఫ్ఏసీ ఇన్‌చార్జి కమిషనర్‌గా, ఎఫ్ఏసీ కౌడా వైస్ చైర్మన్‌గా, మెప్మా ఇన్‌చార్జి పీడీగా, కొవిడ్ సమయంలో స్పెషల్ ఆఫీసర్‌గా, ఎన్నికల అధికారిగా పలు బాధ్యతలు నిర్వహించారు. నరసింహరావు ఆర్డీగా వెళుతుండడంతో కాకినాడ కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు. ఆయన స్థానంలో రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్‌లో సెక్రటరీగా పనిచేస్తున్న కేటీ సుధాకర్ కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ అదనపు కమిషనర్ బాధ్యతలు చేపట్టనున్నారు. కౌడా వైస్ చైర్మన్‌గా కార్పొరేషన్ కమిషనర్ భావనకు ఎఫ్ఏసీ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇప్పటివరకు వీసీగా పనిచేస్తున్న కృష్ణమూర్తి తన మాతృశాఖ రెవెన్యూకు వెళ్లనున్నారు.

రుడా వీసీ బాలస్వామి రిలీవ్

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 31: రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (రుడా) వీసీగా పనిచేస్తున్న బాలస్వామిని రాష్ట్ర ప్రభుత్వం రిలీవ్ చేసింది. అయన్ను ప్రభుత్వానికి రిపోర్టు చేయాలని ఆదేశించింది. బాలస్వామి గత ప్రభుత్వ హయాం నుంచి రుడా వీసీగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుత బదిలీల్లో భాగంగా ఆయనను రిలీవ్ చేశారు. ఇన్‌చార్జి వీసీగా అదనపు బాధ్యతలను రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్‌గార్గ్‌కు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

ప్రైవేటుకే ఓకే!

మద్యం షాపులకు 15న నోటిఫికేషన్

వచ్చే నెల 1 నుంచి కొత్త విధానం... ఇక 'జె' బ్రాండ్లకు స్వస్తి

రాజమహేంద్రవరం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో త్వరలో ప్రైవేటు షాపుల్లో మద్యం అమ్మకాలు ప్రారంభించనున్నారు. జగన్ పిచ్చి బ్రాండ్లకు, నాసిరకం మద్యానికి పూర్తిగా స్వస్తి చెప్పి కొత్త మద్యం విధానం తీసుకొచ్చే ప్రక్రియను కూటమి ప్రభుత్వం వేగంగా చేస్తోంది. ఈ క్రమంలో నాలుగైదు రోజుల్లో ఎంసీ, సియాగ్రామ్స్ వంటి మల్టీ నేషనల్ కంపెనీలకు చెందిన ఎంసీ బాంద్రీ, విస్కీ, ఐబీ విస్కీ, నాకౌట్, ఖజురహో బీర్‌లు తదితర బ్రాండ్ల సరుకు మార్కెట్లోకి వచ్చే అవకాశం కనిపిస్తోంది. ఇప్పటికే వీటి సరఫరాకు ఆయా కంపెనీలకు ఇండెంట్లు వెళ్లాయి. ఇక కొత్త మద్యం పాలసీపై నోటిఫికేషన్ ఈ నెల 15న విడుదల అవుతుందని చెబుతున్నారు. 25కి ప్రక్రియ పూర్తి చేసి 30 నాటికి ప్రైవేటుషాపుల్లో అమ్మకాలు ప్రారంభించనున్నారు. అక్టోబరు 1 నుంచి ప్రభుత్వ మద్యం దుకాణాలు, జగన్ పిచ్చి బ్రాండ్లు కనుమరుగు అవుతాయనే చర్చ నడుస్తోంది. ధరలు కూడా దిగిరానున్నాయి. రూ.120కే రెండు మూడు మంచి బ్రాండ్ల మద్యం అందుబాటులోకి రానుందని తెలుస్తోంది. నాణ్యమైన చీప్‌లిక్కర్‌కి రూ.100లోపే ధర నిర్ణయిస్తారని సమాచారం. అయితే ప్రస్తుతం ఉన్న బార్ల యాజమాన్యాలు, ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న సిబ్బందితో కాస్త ఇబ్బంది తలెత్తే అవకాశం ఉంది. ఇప్పటికే ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పని చేస్తున్న ఉద్యోగులు 7న రాష్ట్ర వ్యాప్తంగా షాపులు మూసేసి ధర్నా చేయడానికి పిలుపునిచ్చారు. జగన్ ప్రభుత్వంలో మద్యం ధరలు అమాంతం పెరిగిన విషయం తెలిసిందే. దానికితోడు బార్లలో క్వార్టరుపై సుమారు రూ.80 వరకూ, బీరుపై రూ.100-130 వరకూ అదనంగా వసూలు చేస్తున్నారు. ప్రైవేటు షాపులు, పర్మిట్ రూంలు వస్తే ఈ విధానం కుదరదు. పైగా ప్రైవేటు షాపుల్లో అన్ని బ్రాండ్లూ అందుబాటులో ఉంటాయి. దీంతో ప్రస్తుతం కొనసాగుతున్న బార్లకు మందుబాబులు వెళ్లే పరిస్థితి ఉండదు. వీటికి లైసెన్సులు జారీ చేసి ఇప్పటికే ఏడాది గడిచింది. రెండో ఏడాది మొదలు కావడంతో లైసెన్సు ఫీజు చెల్లించాల్సి ఉంది. అయితే నిడదవోలులోని రెండు బార్లు ఫీజు చెల్లించలేదు. ఏదిఏమైనా మందుబాబులకు ఇచ్చిన మాట నెరవేర్చేలా బ్రాండ్ మద్యాన్ని ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చేపనిలో ఉంది.







కమిషనరుపై దాడిచేస్తున్న డీఈఈ... డీఈఈపై దాడికి దిగిన కమిషనర్.. మునిసిపల్ ఆర్డీకి వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ, వైసీపీ కౌన్సిలర్లు

వీధిన పడ్డ అధికారుల పోరు

పిఠాపురం మునిసిపల్ సమావేశంలో కమిషనరు, డీఈఈ బాహాబాహీ.. వారి బూతులకు తలదించుకున్న మహిళా కౌన్సిలర్లు, సిబ్బంది

పిఠాపురం, ఆగస్టు 31: పిఠాపురం పురపాలక సంఘంలో కొంతకాలంగా అధికారుల మధ్య సాగుతున్న అంతర్గతపోరు వీధినపడింది. కౌన్సిల్ సమావేశంలోనే కమిషనరు, డీఈఈలు తోపులాట, బాహాబాహీకి దిగారు. సమావేశంలో మహిళలు ఉన్నారని, తాము ఉన్నతాధికారులమని మరిచిపోయి ఇద్దరూ బూతులు తిట్టుకున్నారు. పిఠాపురం పురపాలకసంఘ కార్యాలయంలో శనివారం మునిసిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. చైర్‌పర్సన్ గండేపల్లి సూర్యావతి హాజరుకాకపోవడంతో వైస్‌చైర్మన్-1 పచ్చిమళ్ల జ్యోతి సమావేశానికి అధ్యక్షత వహించారు. సమావేశంలో అజెండాలోని అంశాలు చదువుతుండగా కౌన్సిలరు బోను దేవ మునిసిపాలిటీలో నూతనంగా నియమితులైన అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి జీతాలు చెల్లింపు అంశాన్ని ప్రస్తావించారు. కౌన్సిల్‌కు సమాచారం లేకుండా ఆరునెలలు కిందట ఏడుగురుని అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో నియమించారని, వీరిని నియామకాన్ని రద్దుచేయాలని కౌన్సిల్ తీర్మానం చేసిందని ఆయన గుర్తుచేశారు. కౌన్సిల్ వ్యతిరేకించినా ఏడుగురికి ఏవిధంగా జీతాలు చెల్లించారని, ఇంజనీరింగ్ విభాగంలో ఏ అధికారీ లేరని చెబుతున్నారని, అటువంటప్పుడు బిల్లు ఏ విధంగా చేశారని దేవతోపాటు పలువురు కౌన్సిలర్లు ప్రశ్నించారు. దీనిపై మునిసిపల్ కమిషనరు కనకారావు సమాధానమిస్తూ హైకోర్టు ఆదేశాల మేరకు జీతాలు చెల్లించామన్నారు. బిల్లుల చెల్లింపు విషయంలో కొంతకాలంగా ప్రస్తుత మునిసిపల్ డీఈఈ భవానీశంకర్ తనకు సహకరించడం లేదని, దీంతో తాను ఉన్నతాధికారులకు పరిస్థితిని వివరించగా, ఆ బాధ్యతలను పబ్లిక్‌హెల్త్ ఈఈ హుస్సేన్‌కు అప్పగించారని వివరించారు. ఈ సమయంలో డీఈఈపై కమిషనరు కొన్ని ఆరోపణలు చేశారు. డీఈఈ వల్ల ఏ పని జరగడం లేదని చెప్పుకొచ్చారు. పనుల నిర్వహణలో పలు అవకతవకలు జరిగాయని ఆరోపించారు. దీంతో డీఈఈ భవానీశంకర్ ప్రత్యారోపణలు చేశారు. కమిషనరు వల్లే అధికారులు, సిబ్బంది ఇబ్బంది పడుతున్నారని, 15మంది ఉద్యోగులు బదిలీకి దరఖాస్తు చేసుకున్నారని డీఈఈ తెలిపారు. తనను తీవ్రంగా ఇబ్బందులకు గురిచేస్తే కోర్టు నుంచి ఉత్తర్వులు తెచ్చుకున్నానని తెలిపారు. ఈ సమయంలో కమిషనరు, డీఈఈలు ఆరోపణలు చేసుకున్నారు. ఇది వాగ్వివాదం, తోపులాటకు దారితీసింది. ఇరువురు ఒకరిని ఒకరు కొట్టుకున్నారు. బూతులు తిట్టుకున్నారు. దీనితో ఒక్కసారిగా కౌన్సిల్ అంతా విస్మయానికి లోనైంది. కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బంది వచ్చి కొట్లాటకు దిగిన కమిషనరు, డీఈఈలను విడదీశారు. వీరు బూతులు తిట్టుకోవడంతో మహిళా కౌన్సిలర్లు, సిబ్బంది ఇబ్బంది పడ్డారు. మునిసిపల్ కమిషనరుగా కనకారావు ఫిబ్రవరిలో ఇక్కడకు బదిలీపై వచ్చారు. అప్పటినుంచి కమిషనరు, డీఈఈల మధ్య విభేదాలు ఉన్నాయి. ఎన్నికల సమయంలో డీఈఈగా ఉన్న భవానీశంకర్ సెలవు పెట్టడం, అదే సమయంలో డీఈఈపై కౌన్సిలర్ల ఫిర్యాదు నేపథ్యంలో అతన్ని పబ్లిక్ ఇంజనీర్ ఇన్ చీఫ్‌కు సరెండర్ చేస్తూ కమిషనరు కనకారావు ఉత్తర్వులు జారీ చేశారు. అదే సమయంలో డీఈఈ హైకోర్టును ఆశ్రయించి తిరిగి విధుల్లోకి చేరగా, డీఈఈ చాంబర్‌కు కమిషనరు తాళాలు వేయించడం వివాదస్పదంగా మారింది. అప్పటినుంచి ఇద్దరి మధ్య పలుమార్లు గొడవలు జరిగాయి. డీఈఈ తనకు సహకరించడం లేదని, పనులు చేయడం లేదంటూ ఉన్నతాధికారులకు కమిషనరు ఫిర్యాదు చేయడంతో పబ్లిక్‌హెల్త్ ఈఈని ఇన్‌చార్జిగా నియమించారు. దీంతో ఇద్దరి మధ్య వివాదం మరింత ముదిరింది.

ఉన్నతాధికారుల విచారణ.. డీఈఈ సస్పెన్షన్

మునిసిపల్ సమావేశంలో కమిషనరు, డీఈఈ కొట్టుకున్న వ్యవహారంపై పురపరిపాలనాశాఖ ప్రాంతీయ డైరెక్టరు నాగనరసింహరావు, కాకినాడ ఆర్డీవో ఇట్ల కిషోర్‌లు విచారణ చేపట్టారు. కమిషనరు, డీఈఈతోపాటు మునిసిపల్ అధికారులు, సిబ్బంది, కౌన్సిలర్లు నుంచి స్టేట్‌మెంట్లు తీసుకున్నారు. కమిషనరు, డీఈఈలను వారు మందలించారు. కమిషనరు, డీఈఈల వ్యవహారశైలి గురించి ప్రత్యేకంగా విచారించారు. మునిసిపాలిటీలో జరుగుతున్న వ్యవహారాలు, నిబంధనలకు విరుద్ధంగా పోస్టుల భర్తీపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్లు వినతిపత్రం అందజేశారు. విచారణ నివేదికను ప్రభుత్వానికి సమర్పిస్తామని మునిసపల్ ఆర్డీ, కాకినాడ ఆర్డీవోలు తెలిపారు. కాగా పిఠాపురం మునిసిపల్ డీఈఈ ఎస్.భవానీశంకర్‌ను సస్పెండ్ చేస్తూ పబ్లిక్‌హెల్త్ ఇంజనీర్ ఇన్ చీఫ్ ఆర్.గోపాలకృష్ణారెడ్డి శనివారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. మరోవైపు ఈ వ్యవహారంపై మునిసిపల్ ఆర్డీ నాగనరసింహరావు, ఆర్డీవో ఇట్ల కిషోర్‌లు విచారణ జరిపి కలెక్టరుకు నివేదిక ఇచ్చారు. కమిషనరుతో వాగ్వివాదానికి దిగి, మ్యాన్‌హేండ్లింగ్ చేయడంతోపాటు అతనిపై ఉన్న అవినీతి ఆరోపణలు దృష్టిలో ఉంచుకుని డీఈఈని సస్పెండ్ చేయాలని కలెక్టరు సిఫారసు చేశారు.



ఒకే కాన్పులో ముగ్గురు పిల్లలు

ఇద్దరు మగ, ఒకరు ఆడపిల్ల జననం

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఆగస్టు31: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం పట్టణంలో శారదానర్సింగ్ హోమ్‌లో శనివారం అరుదైన కాన్పు జరిగింది. రాజానగరం మండలం పాతతుంగపాడు గ్రామానికి చెందిన ఆలపాటి సంధ్యాకుమారి ఒకే కాన్పులో ముగ్గురు బిడ్డలకు జన్మనిచ్చింది. ఇద్దరు మగ పిల్లలు, ఒక ఆడపిల్ల పుట్టారు. శారదా నర్సింగ్ హోమ్ వైద్యులు డాక్టర్ గిరిబాల, డాక్టర్ శ్రావ్య బృందం ఆరోగ్యశ్రీ ద్వారా కుమారికి శస్త్ర చికిత్స చేసి కాన్పు జరిపారు. పిల్లలు ముగ్గురు పూర్తి ఆరోగ్యంతో ఉండవలసిన బరువుతో ఉన్నట్టు డాక్టర్ గిరిబాల తెలిపారు. డాక్టర్ గిరిబాల మాట్లాడుతూ ఆలపాటి వీరబాబు, సంధ్యాకుమారిలకు వివాహమై ఐదేళ్లు అయినా సంతానం కలగలేదని, శారద నర్సింగ్ హోమ్‌లో చికిత్స తీసుకున్నాక సంధ్యాకుమారి గర్భందాల్చిందని తెలిపారు.

వృద్ధురాలిపై అత్యాచారయత్నం చేసిన నిందితుడికి రిమాండ్

కరప, ఆగస్టు 31: వృద్ధురాలిపై అత్యాచారయత్నం చేసిన నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టుకు తరలించగా మెజిస్ట్రేట్ అతడికి 14రోజుల రిమాండ్ విధించినట్టు కరప ఇన్‌చార్జ్ ఎస్ఐ కె.రామారావు తెలిపారు. కాకినాడ జిల్లా కరప మండలం వేళంగిలో 85 ఏళ్ల వృద్ధురాలిపై అదే గ్రామానికి చెందిన నొక్కు వెంకటరమణ గురువారం రాత్రి అత్యాచారయత్నానికి ఒడిగట్టిన విషయం తెలిసిందే. బాధితురాలు ఇచ్చిన స్టేట్‌మెంట్ ఆధారంగా నిందితుడిపై ఇంట్లోకి అక్రమ ప్రవేశం, దాడి, అత్యాచారయత్నం సెక్షన్ల కింద కేసు నమోదు చేశామన్నారు. విచారణలో భాగంగా వేళంగి గ్రామ శివారున నిందితుడిని అదుపులోకి తీసుకుని శనివారం కాకినాడ స్పెషల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఫర్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కోర్టులో హాజరుపరచామన్నారు. నిందితుడికి రిమాండ్ విధించగా కాకినాడ సబ్‌జైలుకు తరలించామని వివరించారు.

బహిర్భూమికి వెళ్లి డ్రైన్‌లో పడి వ్యక్తి మృతి

పి.గన్నవరం, ఆగస్టు 31: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం మొండెపులంక నుంచి మానేపల్లి శివారు శివాయిలంక వరకు మిగులు నీరు ప్రవహించే మినీ డ్రైన్‌లో శనివారం ప్రమాదవశాత్తూ ఒక వ్యక్తి జారిపడి మృతిచెందాడు. నాగుల్లంక శివారు శివాయిలంకకు చెందిన బొండాడ రామకృష్ణ (46) శనివారం ఉదయాన్నే స్థానికంగా ఉన్న తోటల్లో మినీ డ్రైన్ చెంతకు బహిర్భూమికి వెళ్లాడు. ఆ సమయంలో జారిపడగా కేకలు వేశాడు. స్థానికులు వచ్చి రక్షించే ప్రయత్నం చేసినా అప్పటికే రామకృష్ణ మునిగిపోయాడు. రెవెన్యూ అధికారులు అక్కడకు చేరుకుని స్థానికంగా ఉన్న ఈతగాళ్ల సాయంతో రామకృష్ణ మృతదేహాన్ని వెతికితీశారు. అనంతరం ఎస్ఐ బి.శివకృష్ణ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఆసుపత్రికి తరలించారు. రామకృష్ణకు భార్య శ్రీలక్ష్మి, కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆ కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయి భార్య పిల్లలు, బంధువులు రోదిస్తుండడంతో శివాయిలంక గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.



నుజ్జయిన లారీ క్యాబిన్

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ మృతి

పాచిపెంట, ఆగస్టు 31: పార్వతీపురం మన్యం జిల్లా పాచిపెంట మండలంలోని కంకణాపల్లి సమీపంలో గల ఘాట్ రోడ్డు జాతీయ రహదారిపై శుక్రవారం అర్ధరాత్రి జరిగిన ప్రమాదంలో కాకినాడకు చెందిన లారీ డ్రైవర్ చెట్లపల్లి తాతారావు (58) మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు.. నవరంగపూర్ నుంచి కాకినాడకు దాణా లోడుతో వెళ్తుండగా కంకణాపల్లి వద్ద ముందున్న లారీని ఢీకొట్టింది. దీంతో క్యాబిన్ నుజ్జుకావడంతో డ్రైవర్ తాతారావు రెండు కాళ్లు విరిగిపోయి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. డ్రైవర్ తాతారావు కుమారుడు విజయకుమార్ ఫిర్యాదు మేరకు హెచ్‌సీ సమర్పణరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏజెన్సీ సమాచారం

ముందుగానే పింఛన్లు పంపిణీ : ఎమ్మెల్యే శిరీష దేవి


పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శిరీషదేవి

రాజవొమ్మంగి, ఆగస్టు 31: మండలంలోని అనంతగిరి గ్రామంలో శనివారం రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి పింఛన్ పంపిణీ చేశారు. అధికారులతో కలిసి గ్రామంలోని ప్రతి ఇంటికీ ఎమ్మెల్యే నేరుగా వెళ్లి పింఛన్ అందజేయడంతో లబ్ధిదారులు ఆనందంగా అందుకున్నారు. ఎమ్మెల్యే శిరీషదేవి మాట్లాడుతూ సెప్టెంబరు 1న ఆదివారం సెలవు కావడంతో రెండవ తేదీ పింఛన్ పంపిణీ చేస్తే లబ్ధిదారులకు పింఛన్ ఆలస్యం అవుతుందని, కూటమి ప్రభుత్వం ఒకరోజు ముందుగానే పింఛన్ పంపిణీ చేస్తుందన్నారు. మండలంలోని 19పంచాయతీలలో శనివారం పింఛన్లు పంపిణీ చేశారు. ఎంపీడీవో యాదగిరేశ్వరావు నేరుగా కొందరికి పింఛన్లు అందజేశారు.

పింఛన్ల పంపిణీలో అలసత్వం వహిస్తే చర్యలు : పీవో


వై.రామవరంలో ఓ అంధురాలికి పింఛన్ అందిస్తున్న ఐటీడీఏ పీవో సింహాచలం

వై.రామవరం: ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో సిబ్బంది అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం హెచ్చరించారు. శనివారం ఆయన వై.రామవరం, అడ్డతీగల మండలాల్లో పర్యటించి సామాజిక పింఛన్లను స్వయంగా అందజేశారు. పింఛన్ల పంపిణీ సకాలంలో జరుగుతుందా లేదాని అడగ్గా లబ్ధిదారులు సంతృప్తిని వ్యక్తం చేశారు. అనంతరం యార్లగడ్డ ఆశ్రమ పాఠశాల, పి.యర్రగొండ ఏకలవ్య పాఠశాల, గురుకుల కళాశాలను సందర్శించి వసతిగృహాల్లోని విద్యార్థులకు అందుతున్న ఆహారపదార్థాలు పరిశీలించారు. విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న మెనూ ప్రకారం ఆహారపదార్థాలు అందివ్వాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో కె.బాపన్నదొర, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు. మండలంలో శనివారం 90శాతంవరకు పింఛన్ల పంపిణీ ప్రక్రియ పూర్తి చేసినట్లు ఎంపీడీవో కె.బాపన్నదొర తెలిపారు. మండలంలో 3,320 పింఛన్లకు 3వేలమందికి పంపిణీ చేస్తామని మిగిలినవి సోమవారం ఇస్తామన్నారు.


కోమరవరంలో పింఛన్లు అందజేస్తున్న శీతంశెట్టి

రంపచోడవరం: సామాజిక భద్రతా పింఛన్లు ఒక రోజు ముందుగానే లబ్దిదారులకు అందజేశామని టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు చెల్లుబోయిన శ్రీనివాస్ అన్నారు. శనివారం ఆయన రంపచోడవరంలో లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. తామ రపల్లి పంచాయతీ కొమరవరంలో మాజీ ఎమ్మెల్యే శీతంశెట్టి వెంకటేశ్వరరావు లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. మండల ప్రధాన కార్యదర్శి పి.అనంతమోహన్ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీపై హర్షం

కూనవరం: ఒకరోజు ముందుగానే పింఛన్లు పంపిణీ చేయడంతో జనసేన నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వృద్ధులకు ఎంతో మేలు చేస్తుందని తెలిపారు. ఈసందర్భంగా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు నరేంద్ర, వైస్ఎంపీపీ బండారు సాంబశివరావు, మేజర్ పంచాయతీ సర్పంచ్ హేమంత్, బద్రి పాల్గొన్నారు.

జోరువానలో పింఛన్ల పంపిణీ


పింఛన్లు అందించేందుకు వాగు దాటి వెళుతున్న దృశ్యం

మోతుగూడెం: మోతుగూడెం పరిసరాల్లో శనివారం తెల్లవారుజాము నుంచి జోరువానలో పింఛన్లు పంపిణీ చేశారు. చదలవాడ పంచాయతీ తులసిపాక గ్రామం నుంచి సోకులేరువాగు దాటి మిట్టవాడ, చౌలూరు గ్రామాలకు వెటర్నరీ ఏహెచ్ఏ సురేష్ పింఛన్లు పంపిణీ చేశారు.

చింతూరు ఐటీడీఏ పీవో సుడిగాలి పర్యటన


పింఛను అందజేస్తున్న పీవో భరత్

చింతూరు, ఆగస్టు31: చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వభరత్ శనివారం వివిధ కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఉదయం 8గంటలకు నిమ్మలగూడెంలో ఎన్టీఆర్ భరోసా పింఛను పంపిణీ కార్యక్రమంలో పాల్గొని పింఛనుదారులతో మాట్లాడారు. పీవో కొంతమందికి పింఛన్లు అందజేశారు. అనంతరం ఐటీడీఏ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో సమావేశమై ఆయా శాఖల పరిస్థితిని పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా తెలుసుకున్నారు. అనంతరం జీసీసీ గోదాంలో ఎమ్మెల్సీ పాయింటును తనఖీ చేశారు. సివిల్ సప్లైశాఖ సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. అనంతరం చట్టి అంగన్‌వాడీ సెంటరు సందర్శించిన పీవో అక్కడి చిన్నారులతో కొద్దిసేపు ముచ్చటించారు. తల్లిపేరు మీద ఒకచెట్టు రేపటికోసం కార్యక్రమంలో భాగంగా పీవో అంగన్‌వాడీ కేంద్రంలో ఒక చెట్టును నాటారు. చిన్నా రులకు అందజేసే పౌష్టికాహార విషయంలో నాణ్యత పాటించాలని పీవో అంగన్‌వాడీ సిబ్బందికి సూచించారు. కస్తూర్బా గాంధీ పాఠశాలను సందర్శించిన పీవో స్టోర్ రూంను పరిశీలించారు. వంట గది శుభ్రతను నేరుగా పరిశీలించిన పీవో పరిశుభ్రమైన ఆహారాన్ని విద్యార్థులకు అందజేయాలన్నారు. అక్కడి పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా జరుగుతున్న క్లాట్ పరీక్షల గురించి వివరించారు.

93 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి

దేవీపట్నం: మండలంలో దేవీపట్నం, ఇందుకూరు, ఇందుకూరుపేట, శరభవరం, దేవారం, పాముగండి, పూడిపల్లి తదితర పంచాయతీల్లో సుమారు 93 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో రత్నకుమారి తెలిపారు. శనివారం మండలంలో ఇందుకూరు 1 ఆర్అండ్ఆర్ కాలనీలో ఎంపీడీవో రత్నకుమారి, దేవీపట్నం సర్పంచ్ కుంజం రాజామణి ఇంటింటికి వెళ్లి లబ్దిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందజేశారు.

ఫీల్డ్ అసిస్టెంట్ సస్పెన్షన్

రాజవొమ్మంగి, ఆగస్టు 31: రాజవొమ్మంగి మండలంలోని కింద్ర ఫీల్డ్ అసిస్టెంట్‌ను అధికారులు సస్పెండ్ చేశారు. ఇటీవల జరిగిన ఎంజీఎన్ఆర్‌జీఎస్ సామాజిక తనిఖీలలో కింద్ర గ్రామంలో గంటిమళ్ల నూకరత్నం అనే ఫీల్డ్ అసిస్టెంట్ ఒక చెరువులో పనులు చేయకుండా పనులు చేసినట్టుగా నమోదు చేయడంతో ఆ పనిలో రూ.54794లు అవకతవకలు జరిగినట్టు గుర్తించిన ఉన్నాతాధికారులు ఆమెను టెంపరరీ అవుట్ ఆఫ్ కాంటాక్ట్ (సస్పెండ్) చేశారని ఎంపీడీవో యాదగిరేశ్వరావు, ఏపీవో సురేష్‌కుమార్‌లు తెలిపారు.

రంపచోడవరంలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు

● ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం

రంపచోడవరం, ఆగస్టు 31: బంగాళాఖాతంలో వాయుగుండం ప్రభావంవల్ల ఏజెన్సీలో మూడురోజుల పాటు భారీ వర్షాలు పడే అవకాశం ఉండడంతో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్లు ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం తెలిపారు. శనివారం ఆయన కార్యాలయ చాంబర్‌లో మాట్లాడుతూ సబ్‌కలెక్టరు కార్యాలయంలో 9347759019, 8309388727 కంట్రోల్ రూం నెంబర్లను ఏర్పాటు చేశామన్నారు. వర్షాలు తగ్గే వరకు కొండకాలువలు, వాగులు దాటొద్దని సూచిం చారు. భారీ వర్షాల దృష్ట్యా అధికారులు, సిబ్బంది ఆదివారం ప్రధానకేంద్రాలలో అందుబాటులో ఉండాలని తెలిపారు.

వీడని వాన

ఎటపాక, ఆగస్టు 31: బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో ఏజెన్సీలో శనివారమంతా ఎడతెరపిలేని వర్షం కురిసింది. ఉదయం నుంచి రాత్రి వరకు ఆగకుండా వానపడింది. దాంతో చెరువులు, కుంటలు ప్రాజెక్టులు జలకళను సంతరించుకున్నాయి. కల్వర్టులవద్ద వరదనీరు ప్రవహించింది. కొన్ని గ్రామాల్లో డ్రైనేజీలు లేకపోవడంతో వరద నీరంతా రోడ్లపై నుంచి ప్రవహించింది. వర్షంవల్ల ఇప్పటికే సాగుచేసిన పత్తి పంట, వరి పంటలకు జీవం పోసినట్లైందని రైతులు పేర్కొంటున్నారు.

'న్యాయం చేయాలి'

మోతుగూడెం, ఆగస్టు 31: సీలేరు కాంప్లెక్స్ పరిధిలో గల డొంకరాయి పవర్ కెనాల్ సబ్‌డివిజన్ నందు ఒప్పంద కార్మికుడిగా పనిచేసే మావూరి వీరవెంకట సత్యనారాయణను టీడీపీ సానుభూతి పరుడని, అప్పటి వైసీపీ నాయకులు కక్ష కట్టి అధికారులను బెదిరించి విధులకు దూరం చేశారు. ఈ విషయం విద్యుత్ సౌధ అధికారులకు ఎమ్మెల్యే మిరియాల శిరీష తెలిపారు. ఎమ్మెల్యే సూచనల మేరకు ఎంపీటీసీ కరకా వెంకటరమణ మంగళగిరి ప్రజావాణి కార్యక్రమంలో మంత్రి టి.జి.భరత్‌ను కలిసి ఈ వ్యవహారం వివరించి అర్జీ అందజేశారు. మంత్రి సానుకూలంగా స్పందించి తగుచర్యలు నిమిత్తం జెన్‌కో అధికారులకు అర్జీని పంపించారు. సత్యనారాయణకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదన్నారు. ఇప్పటికైనా బాధితుడికి న్యాయం చేయాలని ఎంపీటీసీ రమణ కోరారు.

వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

సీతానగరం, ఆగస్టు 31: తుపాన్ కారణంగా కురుస్తున్న అధిక వర్షాలకు మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ఎ. శ్రీనివాస్ సూచించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర విపత్తులశాఖ హెచ్చరికలను అనుసరించి, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. మండల ప్రజలకు ఏ ఇబ్బందులు కలిగినా 6281867443కు కాల్ చేయాలన్నారు. కంట్రోల్‌రూమ్ వద్ద వీఆర్వోలకు, కార్యాలయ సిబ్బందికి డ్యూటీలు వేశామన్నారు. ఉదయం 8.30వరకు 3.5 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైందని ఆయన తెలిపారు.

తెల్లవారే సరికి ఇంటి ముంగిట్లో 'భరోసా'

● ఉదయం 5:30కే పింఛను పంపిణీ చేసిన ఎమ్మెల్యేలు
● జోరువానలో లబ్ధిదారులకు అందజేత


బెడ్‌పై ఉన్న వృద్ధుడికి పింఛను ఇస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 31: సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు ఎన్‌టీఆర్ భరోసా పింఛన్లు శనివారం తెల్లవారే సరికి లబ్ధిదారుల ఇళ్ల ముంగిట్లోకి చేరాయి. ఉదయం 5:30కు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ వర్షంలో స్థానిక ప్రకాశంనగర్‌లో లబ్ధిదారుల ఇంటికి వెళ్లి మంచానికే పరిమితమైన వృద్ధుడికి పింఛను అందించారు. జనసేన నగర అధ్యక్షుడు వై.శ్రీను, టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వర్రే శ్రీనివాసరావులతో కలసి ఆయన పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానం మేరకు ప్రతినెలా 1న లబ్ధిదారులకు పెన్షన్ అందజేస్తుందన్నారు. ఈ నెల 1వ తేదీ ఆదివారం సెలవుదినం కావడంతో ఒకరోజు ముందే అందరికీ పెన్షన్ అందిస్తున్నామన్నారు. గత ప్రభుత్వం వివిధ కారణాలతో తొలగించిన పెన్షన్లను వారి అర్హత ఆధారంగా తిరిగి అందించే ప్రక్రియ త్వరలో చేపట్టనున్నట్టు చెప్పారు. అలాగే స్థానిక 42 డివిజన్‌లో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ, 24వ డివిజన్‌లో టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యర్రా వేణుగోపాలరాయుడు, 3వ డివిజన్‌లో శెట్టిబలిజ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ కుడుపూడి సత్తిబాబు, 50 డివిజన్‌లో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవన్‌కుమార్, మరుకుర్తి రవియాదవ్‌ల ఆధ్వర్యంలో పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఒక్కరోజు ముందుగానే పింఛన్ల పంపిణీ : ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి: సెప్టెంబరు 1వ తేదీ ఆదివారం రావడంతో ఆగస్టు నెలాఖ రునే ఎన్టీఆర్ భరోసా సామాజిక పంపిణీ కార్యక్రమాన్ని ప్రభుత్వం ఒక్కరోజు ముందుగానే పంపిణీకి శ్రీకారంచుట్టింది. శుక్రవారం రాత్రి నుంచే వాయుగుండం ప్రభావంతో జోరున వర్షం కురుస్తున్నప్పటికీ పింఛన్ పంపిణీ కార్యక్రమంలో ఎక్కడా ఇబ్బంది లేకుండా అటు అధికారులు, ఇటు కూటమి నాయకులు పింఛన్లనను పంపిణీ చేశారు. ఉదయం ఆరు గంటలకే పొలమూరులో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పింఛన్ల పంపిణీకి శ్రీకారం చుట్టారు. జోరువానను లెక్క చేయకుండా ఇంటింటికీ వెళ్లి వృద్ధులకు, దివ్యాంగులకు పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నల్లమిల్లి మా ట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఉందని పింఛన్లు, ఉద్యోగుల జీతాలు చెప్పినట్లుగానే పంపిణీ చేస్తుందన్నారు. మండలంలో ఉదయం 10గంటలకే 95 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేసినట్లు ఎంపీడీవో హిమమహేశ్వరి తెలిపారు. ఎన్డీయే నాయకులు సత్తి దేవదానరెడ్డి, ద్వారంపూడి ఈశ్వరరెడ్డి, ఈవోపీఆర్‌డీ పద్మావతి, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జోరు వానలో పింఛన్ల పంపిణీ

బిక్కవోలు: జోరు వానలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఒకరోజు ముందుగా శనివారం కొమరిపాలెం గ్రామంలో ఎన్‌టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేశారు. ఈయన వృద్ధులు, వితంతువులు, దివ్యాంగుల ఇళ్లకు వెళ్లి పింఛన్లను వారికి అందజేశారు. ఒకటవ తేదీ ఆదివారం కావడంతో ముందుగా పింఛన్లను పంపిణీ చేస్తున్నామన్నారు. ఈయన వెంట రాష్ట్ర సర్పంచ్‌ల సంఘ మాజీ అధ్యక్షుడు పడాల వెంకటరామారెడ్డి, సర్పంచ్ వాసంశెట్టి రవికుమార్, మాజీ ఉపసర్పంచ్ డీవీఆర్, జనసేన మండల అధ్యక్షుడు ఇందల వీరబాబు, ఎంపీడీవో జేఏ ఝాన్సీ, కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. మండలంలో 95శాతం మందికి పింఛన్లను శనివారం పంపిణీ చేశామని ఎంపీడీవో ఝాన్సీ తెలిపారు. గ్రామంలో లేనివారికి చనిపోయినవారికి పంచలేదని, గ్రామాంతరం వెళ్లిన వారికి ఆది, సోమవారాల్లో పంపిణీ చేస్తామన్నారు.


రంగంపేట: కాకినాడ జీజీహెచ్‌లో పింఛన్ అందజేస్తున్న దృశ్యం

దివాన్‌చెరువు: ఒకరోజు ముందుగానే శనివారం మండలంలో పెన్షన్లు పంపిణీ చేశారు. జోరువానను సైతం లెక్క చేయకుండా రైన్‌కోట్లు, గొడుగులు ధరించి సచివాలయ సిబ్బంది, కూటమి పార్టీల నాయకులతో కలసి ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలి: ఎమ్మెల్యే గోరంట్ల


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోరంట్ల

కడియం, ఆగస్టు 31: స్వయం సహాయక సంఘాలు సహకార సంఘాలుగా ఏర్పాటు కావాల్సిన అవసరం ఉందని రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి పేర్కొన్నారు. శనివారం కడియంలో స్వయం సహాయక సంఘాల మహిళలకు పూలవ్యర్థాల నుంచి అగరబత్తీలు తయారుచేసే శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ, రూరల్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ (ఆర్ఎస్ఈటీఐ) ఈ శిక్షణ ఇస్తోంది. ఎమ్మెల్యే గోరంట్ల ఈ శిక్షణా కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ ప్రతీ మహిళ ఆర్థికంగా అభివృద్ధి చెందే దిశగా ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తుందన్నారు. మహిళలకు డ్రెస్‌మేకింగ్, బ్యూటీషియన్, మగ్గంవర్క్, కంప్యూటర్ ఎకౌంటింగ్, పచ్చళ్లు అప్పడాలు తయారీ వంటి వాటిలో శిక్షణ ఇప్పించడంతోపాటు బ్యాంకర్లు రుణాలు ఇచ్చే విధంగా వారితో మాట్లాడతామన్నారు. అలానే మార్కెటింగ్ సదుపాయానికి కూడా తోడ్పాటు నిచ్చేవిధంగా ప్రణాళికలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, అన్నందేవుల చంటి, మార్గాని సత్యనారాయణ, పాటంశెట్టి రాంజీ, ముద్రగడ జమీ, వెలుగుబంటి నాని, చెక్కపల్లి మురళి, వరగోగుల వెంకటేశ్వరరావు, బోడపాటి గోపి, నాగిరెడ్డి రామకృష్ణ, పాతూరి రాజేష్, విత్తనాల సాయి, గోవిందు, ముత్యాబత్తుల విజయ, ఎంపీడీవో కె.రత్నకుమారి, తహసీల్దారు పోశియ్య ఏపీఎం బి.అప్పలకొండ, యూనియన్ బ్యాంక్ -ఆర్ఎస్ఈటీఐ డైరెక్టర్ తాడి శ్రీనివాసరావు, కూటమినాయకులు, మహిళా సభ్యులు పాల్గొన్నారు.

మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన

● ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ


రక్తదానం చేసిన దాతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే బలరామకృష్ణ

రాజానగరం, ఆగస్టు 31 : డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పుట్టిన రోజు సందర్భంగా నియోజకవర్గ కేంద్రమైన రాజానగరంలో తలపెట్టిన మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఆధ్వర్యంలో స్థానిక రాయల్ కన్వెన్షన్ ఫంక్షన్ హాల్లో శనివారం ఏర్పాటుచేసిన ఈశిబిరాన్ని నాసేన కోసం నావంతు కోఆర్డినే టర్ బత్తుల వెంకటలక్ష్మి ప్రారంభించారు. ఈ శిబిరానికి నియోజకవర్గ వ్యాప్తం గా యువత అధిక సంఖ్యలో విచ్చేసి స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. అనంతరం రక్తదానం చేసిన యువకులను ఎమ్మెల్యే అభినందిస్తూ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

మహిళా కారాగారాన్ని సందర్శించిన డీఎల్ఎస్ఏ కార్యదర్శి

రాజమహేంద్రవరం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి):యువతను పునరు ద్ధరించడం పేరుతో దేశ వ్యాప్తంగా జరుగుతున్న కార్యక్రమంలో భాగంగా మహిళా ప్రత్యేక కారాగారాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ(డీఎల్ ఎస్ఏ) కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాశ్‌బాబు శనివారం సందర్శి ంచారు. నేరం జరిగిన సమయంలో మైనర్‌గా ఉండి ప్రస్తుతం జైలులో ఉన్న వ్యక్తులను గుర్తించి న్యాయస్థానంలో బాల్యత్వా న్ని నిరూపించుకో డానికి అవసరమైన సహాయాన్నిచేసే లక్ష్యంతో ఈ ప్రత్యేక కార్యక్రమం కొనసాగుతోందన్నారు. అనంతరం ప్రభుత్వ బాలుర వసతి గృహాన్ని పరిశీలించారు.

'టీడీపీ కార్యకర్తల కుటుంబానికి అండగా ఉంటాం'

అనపర్తి, ఆగస్టు 31 : తెలుగుదేశం పార్టీ కుటుంబాలకు పార్టీ అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. అనపర్తి మండలం రామవరంలో మహేంద్రవాడ గ్రామానికి చెందిన టీడీపీ క్రియాశీలక సభ్యుడు మేడపాటి కమలారెడ్డి కుటుంబానికి పార్టీ తరపున రూ.2లక్షల చెక్కును ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి చేతుల మీదుగా అందజేశారు. కమలారెడ్డి ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందడంతో పార్టీ రూ.2లక్షల సహాయాన్ని అందజేసింది. కార్యక్రమం లో నాయకులు కోనాల వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జయలక్ష్మి డిపాజిటర్లను ఆదుకోవాలని ఎమ్మెల్యేకు వినతి

అనపర్తి, ఆగస్టు 31: గత రెండేళ్లుగా ఇబ్బందులు పడుతున్న తమను ఆదుకోవాలంటూ ది జయలక్ష్మి ఎంఏఎం కోఆపరేటివ్ సొసైటీ వెల్ఫేర్ సభ్యులు అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డిని ఆశ్రయించారు. శనివారం అనపర్తి మండలం రామవరంలో ఎమ్మెల్యేను కలిసిన సొసైటీ వెల్ఫేర్ సభ్యులు తమ గోడును ఎమ్మెల్యేకు వివరించారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి ఖాతాదారులకు న్యాయం జరిగే విధంగా కృషి చేస్తానని అన్నారు.

తటవర్తి కుటుంబానికి మంత్రి దుర్గేష్ పరామర్శ

కడియం, ఆగస్టు 31: కడియం మండలం దుళ్ల గ్రామానికి చెందిన ఆటో యూనియన్ నాయకుడు తటవర్తి వీర్రాజు ఇటీవల మృతి చెందారు. శనివారం తటవర్తి కుమారులు ఏసు, రాము, రాజాలను మంత్రి కందుల దుర్గేష్ పరామర్శించారు. కార్యక్రమంలో రాష్ట్ర జనసేన నాయకులు రత్నం అయ్యప్ప, కూటమి నాయకులు సూరపురెడ్డి భరత్, తూము శ్రీను, మెర్ల అయ్యప్ప, తోకల ఉదయ్, తోకల శ్రీను, గుర్రపు సత్యనారాయణ, ముమ్మిడి దేవినాగేశ్వరరావు, ఈదర నంద బ్బు, చిక్కాల రాముడు, కంటిపూడి శ్రీను, దూడల సత్తిబాబు, కులపాల సత్తిబాబు ఉన్నారు.

13 నుంచి జీజీయూలో మేధ ఉత్సవాలు

రాజానగరం, ఆగస్టు 31: ఇంజనీర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయంలో సెప్టెంబరు 13వ తేదీ నుంచి మేధ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం (జీజీయూ)రిజిస్ట్రార్ పీఎంఎంఎస్ శర్మ తెలిపారు. రెండు రోజులపాటు నిర్వహించనున్న ఈఉత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. అనంతరం రిజిస్ట్రార్‌శర్మ మాట్లాడుతూ మేధ ఉత్సవాల్లో భాగంగా పేపర్, పోస్టర్ ప్రజంటేషన్, ప్రాజెక్ట్ ఎక్స్‌పో, ఇంట్రాక్టివ్ వెబ్‌డిజైన్, హాక్‌తాన్, రోబో రేస్, టెక్నికల్ క్విజ్, టాక్స్, ఫిలిం మేకింగ్, ట్రెజర్‌హంట్‌తో పాటుగా స్పాట్ ఈవెంట్స్ కూడా ఉంటాయని చెప్పారు. పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తిగల వారు డబ్ల్యుడబ్ల్యుజిజియు. ఈడి యు.ఇన్/ మేధా వెబ్‌సైట్‌లో సెప్టెంబరు 10లోగా తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు, అటానమస్ కళాశాల ప్రిన్సిపాల్ టి.జయానందకు మార్, ప్రిన్సిపాల్ ఎంవీఎస్‌బాబు, పీజీ రామానుజం, కె.వల్లీమాధవి, రామచంద్రన్, లీలావతి, మేధ కన్వీనర్లు బి.సుజాత, ఆర్.తమిళ కోడి తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరరావు సేవలు అభినందనీయం

● జిల్లా విద్యాశాఖాధికారి వాసుదేవరావు


ఉపాధ్యాయుడిని సత్కరిస్తున్న డీఈవో వాసుదేవరావు, డీడీవో వీణాదేవి

కోరుకొండ, ఆగస్టు 31: పవిత్రమైన ఉపాధ్యాయవృత్తిలో పని చేసి అంకితభావంతో ఎందరో విద్యార్థులను ఉత్తమపౌరులుగా తీర్చి దిద్దిన జిల్లా ఉత్త మ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత సింగారపు వెంకటేశ్వరరావు సేవలు అభి నందనీయమని, నేటి ఉపాధ్యాయులకు ఆదర్శప్రాయమని జిల్లా విద్యాశాఖాధికారి వాసుదేవరావు, జిల్లా అభివృద్ధి అధికారి వీణాదేవి, ఎంపీడీవో నరేష్‌కుమార్, మండల విద్యాశాఖాధికారులు బి.కుశలవదొర, ఆర్.స్వామి, సుజాతలు పేర్కొన్నారు. కోరుకొండ మండలం రాఘవాపురంజిల్లా పరిషత్ హైస్కూల్లో స్కూల్ అసిస్టెంట్(సోషల్ స్టడీస్)లో పనిచేసి శనివారం పదవీ విరమణ చేసిన జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడు సింగారపువెంకటేశ్వరరావు అభినందన కార్యక్రమం కోరుకొండలో ఎంఈవో టి.కుశలవ దొర అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు పల్లా రాజారావు, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు షరీఫ్, రాష్ట్ర ప్రధానోపాధ్యాయుల సంఘం ఉపాధ్యక్షుడు కోలా సత్యనారాయణ, ఆంధ్రప్రదేశ్ కాపు వెల్ఫేర్ అసోసియేషన్ సంఘ నాయకులు, జడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీ బొరుసు బద్రి, రాఘవాపురం, కోటి, హైస్కూల్ హెచ్ఎంలు జీవీజే మణికుమారి, ముత్యం శ్రీనివాస్, హెచ్ఎంలు బొడ్డేటి వెంకట్రావు, పీఆర్టీయూ మండలశాఖ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వీరభద్రరావు మాష్టారుకు ఘనంగా వీడ్కోలు

బిక్కవోలు, ఆగస్టు 31: ఇళ్లపల్లి ఉన్నత పాఠశాలలో బయాలజీ స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ శనివారం పదవీ విరమణ చేసిన టి. వీరభద్రరావు మాష్టారుకు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన సభలో వీరభద్రరావు 27 సంవత్సరాలుగా ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దారని హెచ్ఎం పప్పు శ్రీనివాసరెడ్డి కొనియాడారు. అనంతరం వీరభద్రరావు దంపతులను విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ లొల్ల భద్రం, దేశం నేతలు తనుకు శ్రీధర్, కానాటి అప్పలస్వామి, ఎస్ఎంసీ చైర్మన్ తనుకు వీరవెంకటరమణ, ఎంఈఓ సీవీవీ. సత్యనారాయణ, బిక్కవోలు పీహెచ్‌సీ వైద్యురాలు దుర్గాదేవి, ఉపాధ్యాయులు టి. ఈశ్వరరెడ్డి, టి. రామచంద్రారెడ్డి, కె. సత్యనారాయణ, ఎన్. లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.


టీచర్ వీరభద్రరావు దంపతులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు


త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న ఎస్పీ నరసింహ కిషోర్

త్రీటౌన్ స్టేషన్ తనిఖీ చేసిన ఎస్పీ

రాజమహేంద్రవరం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌ని ఎస్పీ నరసింహకిషోర్ శనివారం తనిఖీ చేశారు. రికార్డులు, స్టేషను పరిసరాలు, రిసెప్షను కౌంటరును పరిశీలించారు. తీవ్రమైన కేసులపై ఆరా తీశారు. స్టేషను పరిధి, నేరాల పరిస్థితిని ఎస్పీకి సీఐ వి.అప్పారావు వివరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ తీవ్ర నేరాల దర్యాప్తులో పురోగతి సాధించాలన్నారు. మద్యం, గంజాయి, సారా అక్రమ రవాణాను నియంత్రించాలన్నారు. విజిబుల్ పోలీసింగ్, రాత్రి గస్తీని మెరుగుపరచాలని ఆదేశించారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. బ్లూకోల్ట్స్, రక్షక్ మొబైల్ ప్రతి గంటకూ తమ లోకేషన్ మార్చుకుంటూ అప్రమత్తంగా తిరగాలని, లోకేషన్‌ని కంట్రోల్ రూమ్‌కి ఎప్పటి కప్పుడు తెలియజేయాలని సూచించారు. సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని సిబ్బందికి హామీ ఇచ్చారు.

ఉద్యోగ విరమణ పొందిన సిబ్బందికి సత్కారం


అడిషనల్ ఎస్పీ(క్రైమ్) కె.శ్రీనివాసులు దంపతులను సత్కరిస్తున్న ఎస్పీ

జిల్లాలో ఉద్యోగ విరమణ పొందిన అధికారులు, సిబ్బందిని ఎస్పీ నరసింహ కిషోర్ సత్కరించారు. అడిషనల్ ఎస్పీ(క్రైమ్) కె.శ్రీనివాసులు, ఎస్ఐలు టి.రాంబాబు, కె.నాగరాజు, హెడ్‌కానిస్టేబుల్ వి.రాము ఉద్యోగ విరమణ పొందారు. శాఖాపరంగా ఎలాంటి అవసరమున్నా తనకు నేరుగా తెలియజేయవచ్చని ఎస్పీ భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు రాజశేఖర్‌రావు, ఏవీ సుబ్బరాజు, ఎల్.చెంచిరెడ్డి, జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు ఆర్.రఘురాం, ఉపాధ్యక్షుడు జె.సాయి మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

19 నుంచి నన్నయలో అద్విక-24



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న వీసీ శ్రీనివాసరావు

దివాన్‌చెరువు, ఆగస్టు31 :ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాలఆధ్వర్యంలో సెప్టెంబరు19 నుంచి అద్విక 24 సాంకేతిక ఉత్సవంను నిర్వహిస్తున్నామని ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు తెలిపారు. విశ్వవిద్యాలయంలో శనివారం జరిగిన ఇంజనీరింగ్ ఫ్రెషర్స్‌పార్టీలో అద్విక-24 జాతీయస్థాయి సాంకేతిక ఉత్సవంకు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించి వివరాలను వెల్లడించారు. రెండురోజులపాటు జరిగే సాంకేతిక ఉత్సవంలో పేపర్‌ప్రజెంటేషన్‌లు, పోస్టర్ ప్రజెంటేషన్‌లు, టెక్ క్విజ్, ప్రాజెక్టు ఎక్స్‌పో, షార్ట్‌ఫిల్మ్ మేకింగ్, ప్రజెంటేషన్ ఆఫ్ ఐడియా విత్ వర్కింగ్ హైపోథిసెస్‌డిబేట్ వంటి సాంకేతిక కార్యక్రమాలను నిర్వహిస్తారని తెలిపారు. ఇంజనీరింగ్‌తోపాటు కంప్యూటర్ సంబంధిత కోర్సులు చేస్తున్న విద్యార్థులందరూ దీనిలో పాల్గొనేందుకు అర్హులేనన్నారు. రెండురోజుల సాంకేతిక ఉత్సవంలో పాల్గొనేందుకు ఆన్‌లైన్ రూ.200తో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. అద్విక24 సాంకేతిక ఉత్సవంకు కన్వీనర్‌గా ప్రిన్సిపాల్ పి.వెంకటేశ్వరరావు, కోకన్వీనర్‌గా జి.కీర్తిమరిటా వ్యవహరిస్తారన్నారు. వివరాలకు విశ్వవిద్యాలయ వెబ్‌సైట్ ద్వారా సంప్రదించాలన్నారు.

ఆవ భూముల వ్యవహారంలో డబ్బులు ఎవరి ఖాతాలకు వెళ్లాయి: మాజీ ఎంపీ భరత్

రాజమహేంద్రవరం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ఆవ భూముల వ్యవహారంలో డబ్బులు ఎవరి ఖాతాల్లో పడ్డాయో నిగ్గు తేల్చాలని మాజీ ఎంపీ భరత్‌రామ్ డిమాండ్ చేశారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. తమ హయాంలో లాలాచెరువు వద్ద సుమారు రూ.10కోట్ల విలువచేసే ఇసుక నిల్వచేశామని, అది ఇప్పుడు ఎక్కడికి వెళ్లిందని ప్రశ్నించారు. ఇసుకకు కృత్రిమ కొరతను సృష్టిస్తున్నారని విమర్శించారు. స్థానిక ఎమ్మెల్యే మునిసిపల్ కాంట్రాక్టర్ల నుంచి 5శాతం కమిషన్ అడుగుతున్నారని ఆరోపించారు. గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల వ్యవహా రంలో నిజాలు బయటకు రావాల్సిన అవసరం ఉందన్నారు. కాగా.. ఆవ భూముల్లో అవినీతిపై వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో అప్పటి ఎంపీ భరత్, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడిరాజా బహిరంగంగానే తీవ్ర ఆరోపణలు చేసుకున్న విషయం తెలిసిందే.

డెంగ్యూ, మలేరియా నియంత్రణకు చర్యలు : డాక్టర్ బోడేటి

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 31: వర్షాకాలంలో ప్రజలు డెంగ్యూ, మలేరియా వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండి నివారణకు సహకరించాలని రాజమహేంద్రవరం అంబేడ్కర్ నగర్ అర్బన్ హెల్త్ సెంటర్ మెడిలక్ ఆఫీసర్ డాక్టర్ బోడేటి అశోక్‌కుమార్ అన్నారు. శనివారం హెల్త్‌సెంటర్ పరిధిలోని గోరక్షణ పేట, దానవాయిపేట, కెఎస్ఆర్ పేట సచివాలయాల పరిధిలో ఆయన మెడికల్ క్యాంప్‌లు నిర్వహించి వైద్య పరీక్షలు చేశారు. ఇంటి పరిసరాలను ప్రజలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. జ్వరంవస్తే వెంటనే పీహెచ్‌సీ వైద్యులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌వీ ఎంఎస్ఎస్ కుమారి, ఏఎన్ఎంలు సూరికుమారి, కె.రత్నం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

జ్వరాల అదుపునకు ప్రత్యేక వైద్య శిబిరాల ఏర్పాటు


అనపర్తి: రోజురోజుకు పెరుగుతున్న జ్వరాలను అదుపు చేసేందుకు గ్రామాలలో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని రామవరం పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ ఎన్.సుమతీదేవి తెలిపారు. శనివారం దుప్పలపూడి పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన రోగులకు మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సుమతీదేవి మాట్లాడుతూ సుమారు 100మదికి పైగా పరీక్షలు నిర్వహించా మని అనుమానం ఉన్న వారికి డెంగ్యూ, మలేరియా నిర్ధారణ పరీక్షలను కిట్ల ద్వారా నిర్వహిం చా టమన్నారు. ఈ శిబిరంలో డాక్టర్ కే మీనాక్షీదేవి, ఎమ్‌పీహెచ్‌ఈవో కెవీవీ సుబ్రహ్మణ్యం, హెచ్ఎస్ శ్రీనివాస్, హెచ్‌వి ఎస్ లక్ష్మీ, సిహెచ్‌వోలు కుమారి, అనుగ్న, నిర్మల, ఏఎన్ఎమ్ భారతి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు

కడియపులంక దళితవాడలో ఫీవర్ సర్వైలెన్స్

కడియం, ఆగస్టు 31: కడియపులంక దళితవాడలో శనివారం ఫీవర్ సర్వైలైన్స్ కార్యక్రమం జరిగింది. అనంతరం చర్చివీధిలో వైద్యశిబిరం ఏర్పాటుచేశారు. ఈ వైద్య శిబిరంలో వైద్యాధికారి స్వరూప వైద్యసేవలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ స్వరూప మాట్లాడుతూ ప్రతీఒక్కరూ జాగ్రత్తలు పాటించాలన్నారు. సురక్షిత మంచినీరు, ఆహార నియమాలు పాటించాలన్నారు. నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, పరిసరాలు పరిశుభ్రత పాటించాలని సూ చించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు, హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



తూర్పుగోదావరి
జిల్లా వార్తలు

ఆదివారం 1 సెప్టెంబరు 2024 | 3



హస్తకళల ఎగ్జిబిషన్ ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రశాంతి, ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

చేతి వృత్తుల ప్రోత్సాహానికి రాయితీలు : కలెక్టర్

రాజమహేంద్రవరం కల్చరల్/ అర్బన్, ఆగస్టు 31 : ప్రభుత్వం చేతి వృత్తులు, చేనేత కార్మికులను ప్రోత్సహించేందుకు రాయితీలను అందిస్తున్నదని కలెక్టర్ ప్రశాంతి అన్నారు. రాజమహేంద్రవరం జాంపేటలోని శ్రీ ఉమా రామలింగేశ్వరస్వామి ఫంక్షన్ హాలులో హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో గాంధీ శిల్ప బజార్ పేరుతో సెప్టెంబరు 5వ తేదీ వరకూ నిర్వహించే హస్తకళలు, కళాత్మక వస్త్రాల విక్రయ ఎగ్జిబిషన్‌ను శనివారం ప్రారంభించి మాట్లాడారు. నగర ప్రజలతో పాటు పరిసర ప్రాంత వాసులు ఈ కళాత్మకమైన ఉత్పత్తులను కొనుగోలు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం హస్తకళలు, చేనేత ఉత్పత్తుల అభివృద్ధికి ఎనలేని కృషి చేస్తున్నదని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాష్ట్ర హస్త కళాకారుల సంస్థ ఈడీ విశ్వ మాట్లాడుతూ ప్రతి రోజూ ఉదయం 11 నుంచి రాత్రి 9 గంటల వరకూ ఎగ్జిబిషన్ తెరిచే ఉంటుందన్నారు. వివిధ రాష్ట్రాలు, ప్రాంతాల నుంచి వచ్చిన 50 మంది హస్త కళాకారులు ఈ ఎగ్జిబిషన్‌లో స్టాల్స్ ఏర్పాటు చేశారని తెలిపారు.అసిస్టెంట్ డైరెక్టర్ అపర్ణలక్ష్మి, లేపాక్షి రాజమహేంద్రవరం మేనేజర్ మోనిక, సిరాజుద్దీన్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బడులకు సెలవు.. ఎస్ఏ-1 పరీక్ష వాయిదా

కోరుకొండ, ఆగస్టు 31 : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా జిల్లావ్యాప్తంగా అన్ని పాఠశాలలకు శనివారం ఆకస్మిక సెలవు ప్రకటించారు. కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశాలతో జిల్లా విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు ఉత్తర్వులు విడుదల చేశారు. దీంతో శనివారం జరగాల్సిన సెల్ఫ్ ఎసెస్‌మెంట్-1లో భాగంగా ప్రాథమిక పాఠశాలలకు గణితం,ఉన్నత పాఠశాలలో జరగాల్సిన ఇంగ్లీషు పరీక్షను వాయిదా వేశారు. తిరిగి ఈ పరీక్షలు 6వ తేదీన నిర్వహిస్తారు.



ఆహ్లాదం.. కనుమరుగు

పాలకుల అలక్ష్యం.. అధికారుల నిర్లక్ష్యం వెరసి.. కొవ్వూరు గోదావరి బండ్‌పై కోట్లాది రూపాయలతో అందంగా తీర్చిదిద్దిన పార్కులో ఆహ్లాదం కనుమరుగైంది.. పాములు.. విషపురుగులకు ఆవాసంగా మారింది.. 6

ఆదివారం ప్రత్యేకం

ఆహా.. అన్నవరం ప్రసాదం



- అమృతం.. అన్నవరం ప్రసాదం
- 150 గ్రాములు రూ.20
- ఏటా 2 కోట్ల ప్యాకెట్లు విక్రయాలు
- ఆలయానికి రూ.40 కోట్ల ఆదాయం
- రుచి.. శుచిలో అద్భుతం
- గోధుమ రవ్వతో అదరహో
- బయటచేసినా రాని ప్రసాద రుచి
- రత్నగిరిపై 133 ఏళ్లుగా అదే ప్రసాదం
- తాజాగా ఎఫ్ఎస్ఎస్ఏఐ గుర్తింపు

కాకినాడ (ఆంధ్రజ్యోతి)/అన్నవరం :

అమృతం అంటే ఎలా ఉంటుందని ఎవరినైనా అడిగితే అన్నవరం ప్రసాదంలా ఉంటుందంటారు చాలామంది.. అడ్డాకులో వేడివేడిగా ఉండే ప్రసాదాన్ని ఒక్కసారి రుచి చూశారా వదిలిపెట్టరు.. ఎవరు పెడతానన్నా కాదనరు... నోట్లో ఇలా వేసుకుంటే అలా కరిగిపోతుంది. మధ్యప్రదేశ్ నుంచి వచ్చే మల్వరాజ్ గోధుమల ద్వారా తయారు చేసే ఈ ప్రసాదానికి మరేదీ సాటిరాదంటే అతిశయోక్తికాదు. ప్రసాదం తయారీలో రుచి, శుచికి ఎంతో ప్రాధాన్యం ఇస్తారు. అందుకే తాజాగా భారత ఆహార భద్రతా ప్రమాణాల సంస్థ (ఎఫ్ఎస్ఏఐ) గుర్తింపు లభించింది. ఇప్పటికే దీనికి 2019లో ఐఎస్‌వో 22000: 2005 గుర్తింపూ లభించింది. ఏటా రెండు కోట్లకుపైగా ప్యాకెట్లు అమ్ముడవడమే అన్నవరం ప్రసాదం రుచికి నిదర్శనం.

ప్రసాదం చరిత్రకు 133 ఏళ్లు..

అన్నవరం సత్యదేవుడి ఆలయం 1891లో ప్రతిష్ఠితమైంది. అప్పటి నుంచి భక్తులకు గోధుమ రవ్వ ప్రసాదాన్నే అందిస్తున్నారు. అన్నవరం ప్రసాదం అంటే భక్తులకు ఎంత ప్రీతిపాత్రమో చెప్పనక్కర్లేదు. ఉభయ గోదావరి జిల్లాల వాసులు రాజకీయ నాయకులు, ఉన్నతాధికారులు ఎవరిని కలవడానికి వెళ్లినా సత్యదేవుడి ప్రసాదం తీసుకెళ్లి అందించడం సర్వసాధారణం. ప్రసాదంతో వెళితే తలచిన పని త్వరితగతిన పూర్తవుతుందనేది వారి నమ్మకం. ఎందుకంటే అన్నవరం సత్యదేవుడి ప్రసాదానికి నాణ్యత, రుచి, శుచిలో తిరుగులేదు.. భారత ఆహార ప్రమాణాల సంస్థ తాజాగా ఎఫ్ఎస్ఎస్ఏఐ గుర్తింపు నిచ్చింది. ఏటా రెండుకోట్లకుపైగా స్వామివారి ప్రసాదం ప్యాకెట్లను దేవస్థానం విక్రయిస్తోంది. ఒక్క ప్రసాదాల ద్వారా ఏటా రూ.40 కోట్ల ఆదాయం సమకూరుతోంది.

మధ్యప్రదేశ్ నుంచి మల్వరాజ్ గోధుమలు..

అన్నవరం ప్రసాదానికి అసలు అంత రుచి ఎక్కడి నుంచి వస్తోంది, అసలు ప్రసాదం ఎలా తయారు చేస్తారనే సందేహాలు చాలామందికి ఉన్నాయి. కోట్లాది మంది భక్తుల మనసుదోచే అన్నవరం ప్రసాదం తయారీలో దేవస్థానం చాలా జాగ్రత్తలు తీసుకుంటుంది. స్థానికంగా దొరికే దినుసులతో ప్రసాదం చేయదు. అత్యంత నాణ్యమైన వస్తువులను రప్పించి మరీ తయారుచేస్తోంది. ప్రసాదం తయారీలో అత్యంత కీలకమైన గోధుమలను ఏకంగా మధ్యప్రదేశ్ నుంచి మల్వరాజ్ రకం దిగుమతి చేసుకుంటోంది. రత్నగిరి కొండపై గోధుమ నూకగా మర ఆడించడానికి ప్రత్యేక యంత్రాలు వినియోగిస్తారు.



ప్రసాదం తయారుచేసే వంట గది

విస్తరాకులే ఎందుకంటే..

సత్యదేవుడి ప్రసాదం ఇప్పటికీ విస్తరాకుల్లోనే భక్తులకు అందిస్తుంటారు. ప్రస్తుతం సాంకేతికంగా అన్నిరంగాల్లో మార్పులు వచ్చినా సత్యదేవుడి ప్రసాదం మాత్రం ఇతరత్రా ప్యాకింగ్‌ల్లో కాకుండా కేవలం విస్తరాకుల్లో వేసి విక్రయించాలని దేవస్థానం అధికారులు నిర్ణయించారు. ప్యాకింగ్ సమయంలో అత్యంత వేడి కలిగిన ఈ ప్రసాదం విస్తరాకుల్లో వేయగానే ఆవిరి, సుగంధ ద్రవ్యాలతో ఆకు మధురంగా మారుతుంది. అందుకే చాలామంది భక్తులు అన్నవరం స్వామి ప్రసాదాన్ని ఆకుతో నాకేయాలంటూ ఛలోక్తులు విసురుతుంటారు. ఈ విస్తరాకులను ఏజెన్సీ ప్రాంతం నుంచి తీసుకొస్తారు. విస్తరాకుల డిమాండు మేరకు అన్నవరం దేవస్థానం ఆధ్వర్యంలోనే కాకినాడ జిల్లా శంఖవరం మండలం గొంది గ్రామంలో 40 ఎకరాల్లో విస్తరాకు తోటలు పెంచాలని అధికారులు భావిస్తున్నారు.





ఎఫ్ఎస్ఎస్ఏఐ సర్టిఫికెట్ అందుకుంటున్న ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ (ఫైల్)

అన్నవరం ప్రసాదం తయారీ ఇలా..

ప్రసాదం తయారీకి 3:2:1 నిష్పత్తిలో దినుసులు వేస్తుంటారు. 45 లీటర్ల నీటిని ఎక్కువగా మరిగించి ముందుగా 15 కిలోల మర ఆడించిన గోధుమలను అందులో వేస్తారు. అరగంట ఉడికిన తర్వాత 30 కిలోల పంచదారను కళాయిలో పోసి ఉడికిస్తారు. ఆ తర్వాత స్వచ్ఛమైన ఆవునెయ్యిని మిశ్రమం చేసి ఉడికిన తర్వాత యాలకుల పొడి మిశ్రమాన్ని కళాయిలో వేస్తారు. గంటసేపు వంటస్వాములు బాకుతో తిప్పగా ప్రసాదం పూర్తిగా గోధుమరంగులోకి వస్తుంది. అప్పుడు ట్రాలీ తొట్టిల్లో కళాయిల నుంచి డంపు చేస్తారు. ట్రాలీ తొట్టిలో వేసిన తర్వాత మరోసారి యాలికల పొడి మిశ్రమాన్ని వేసి మూడు గంటలపాటు ఉంచుతారు. ఆ తరువాత ప్యాకింగ్ విభాగానికి తీసుకెళతారు.



విస్తరాకుల్లో ప్రసాదం



యాలికుల పొడి చల్లి పక్కన ఉంచిన ప్రసాదం

ఏటా 2 కోట్ల ప్యాకెట్ల అమ్మకాలు..

సత్యదేవుడి ప్రసాదాన్ని లొట్టలేసుకుని తినని భక్తులుండరు. 150 గ్రాముల ప్యాకెట్లను రూ.20కి విక్రయిస్తారు. రోజంతా విక్రయాలు అందుబాటులో ఉంటాయి. ప్రసాదం ప్యాకెట్లు ఏటా 2 కోట్లు విక్రయిస్తారు. ఒక్కొక్క ప్రసాదం ప్యాకెట్టు 150 గ్రాముల ఉం డేలా తూనిక లేకుండా హస్తంగరిటతో విస్తరాకుల్లో వేసి 58 మంది ప్యాకింగ్ చేస్తారు. వీటిని బుట్టల్లో 100 ప్యాకె ట్ల చొప్పున వేసి మరో 10 మంది కావిడ మోతదారులు ప్రసాదం విక్రయ కేంద్రాలకు తీసుకెళ్తారు. ప్రసాదం భక్తులకు 24 గంటలు అందుబాటులో ఉంచుతారు. ప్ర సాదం ప్యాకింగ్ చేసే సమయంలో ప్యాకర్లు తలపై టోపీ చేతులకు గ్లవ్స్ తొడిగి ఎంతో శుచిగా తయారుచేస్తుంటారు. అన్నవరం ప్రసాదం తయారీకి 10 మంది వంటస్వాములు విడతలవారీగా విధులు నిర్వహిస్తారు. వీరంతా కొండపై తయారుచేసిన ప్రసాదాన్ని తిరిగి ఇంటికి వెళ్లి చేసినా రుచి, నాణ్యత రాదంటారు. కేవలం కొండపైనే ప్రసాదం తయారీ విభాగంలో చేస్తేనే సత్యదేవుడి మహిమతో ఇంతటి రుచి వస్తుందని పేర్కొనడం విశేషం.



హోరు వానా.. తలొంచెన్!

తొలిరోజే 96.34 శాతం మందికి పింఛన్లు

- సచివాలయ సిబ్బంది సంకల్ప బలం
- సాయంత్రానికే నూరు శాతానికి చేరువ
- 100 రోజుల్లో గాడిలో పెట్టిన కూటమి
- వలంటీర్లు లేకున్నా వేగంగా అందజేత
- కేవలం మిగిలింది 3.66 శాతమే
- ఒక రోజు ముందే వృద్ధులకు ఆనందం
- సోమవారమూ పంపిణీ

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

చినుకు పడుతున్నా చలించలేదు.. పింఛన్ల పంపిణీ ఆగిపోలేదు..సీఎం చంద్రబాబు సంకల్ప బలానికి.. జిల్లా అధికారుల నిబద్ధత తోడైంది. వెరసి సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ రికార్డు సృష్టించింది. హోరున వాన కురుస్తున్నా తెల్లవారుజామునే ప్రభుత్వోద్యోగి, ప్రజాప్రతినిధి లబ్ధిదారుడి ఇంటికెళ్లి రూ.4 వేల పింఛను చేతిలో పెట్టారు. ఒక్క రోజులో కాదు.. కేవలం 15 గంటల్లో 96 శాతం మందికిపైగా లబ్ధిదారులకు పింఛను అందిచారు. ఉదయం 5.30గంటల సమయానికి రాష్ట్రం లోనే జిల్లా మొదటి స్థానంలో కొనసాగి 6 శాతం మందికి పంపిణీ పూర్తి చేసింది.దీంతో లబ్ధిదారుల కళ్లు ఆనందంతో కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞత చెప్పాయి.

కోరుకొండ ఫస్ట్..

జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి పింఛన్ల పంపిణీపై వారం నుంచే కసరత్తు ఆరంభించారు. ఒక ప్రణాళిక ప్రకారం ఉద్యోగులకు ఆదేశాలు ఇచ్చారు. ఉదయం 6 గంటల్లోపే రాష్ట్రంలోనే మొదటిగా జిల్లాలోని మొత్తం 512 సచివాలయాలు లాగిన్ అయ్యాయి. 4,857 మంది సిబ్బంది పింఛన్ల పంపిణీ ఆరంభించారు. మొత్తం 2,39,924 పింఛను లబ్ధిదారులకు రూ.102,31,63,500 అందజేయాల్సి ఉండగా రాత్రి 7.55 గంటల సమయానికి 2,31,054 (96.34%) మందికి మొత్తం రూ.98,56,93,500 నగదు అందజేశారు. కోరుకొండ మండలం 97.62 శాతంతో మొదటి స్థానంలో ఉండగా తర్వాతి స్థానాల్లో వరుసగా రంగంపేట (97.44%), రాజానగరం(97.28%) ఉన్నాయి.బ్యాంకు సెలవులు, ఆదివారం కారణాలతో ప్రభుత్వం ఒక రోజు ముందే పింఛను అందజేశారు. దీనికి అనుగుణంగా డీఆర్‌డీఏ పీడీ ఎన్‌వీవీఎస్ మూర్తి అధికారులను సమ న్వయం చేసుకున్నారు.ప్రతి మండలానికి సంబంధించిన గణాంకాలు ఎప్పటికప్పుడు వచ్చేలా ఏర్పాటు చేశారు. మునిసిపల్ కార్పొరేషన్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం ద్వారా సూచనలు జారీ చేశారు. లబ్ధిదారులకు ఒక రోజు ముందుగానే అంటే 30వ తేదీ సాయంత్రమే ఫోన్లు చేసి 31న ఇంటి వస్తున్నాం పింఛన్ ఇస్తాం అందుబాటులో ఉండాలని సూచించారు. ఆదివారం సెలవు కావడంతో మిగిలిన వారికి సోమవారం పింఛను పంపిణీ చేస్తారు.

100 రోజుల సంకల్ప బలం

100 రోజుల్లో పింఛన్లను గాడిలో పెడతాం.. సీఎం చంద్రబాబు చెప్పిన ఈ మాటకు హోరు వాన కూడా తలవంచింది. శుక్రవారం ఉదయం నుంచీ ఆకాశానికి చిల్లు పడిందా అనే చందంగా ఎడతెరిపి లేకుండా వాన పడుతున్న విషయం తెలిసిందే.అయినా యంత్రాంగం ఎక్కడా వెనకడుగు వేయలేదు. శనివారం ఇంటింటికీ వెళ్లి పింఛన్లు ఇచ్చారు.



గౌతమి జీవకారుణ్య సంఘంలో కలెక్టర్

నారాయణపురం సమీపంలో ఉన్న శ్రీ గౌతమి జీవకారుణ్య సంఘంలో కలెక్టర్ పి.ప్రశాంతి వృద్ధులను పలకరించి ఆప్యాయంగా రూ.4 వేల చొప్పున పింఛను అందించారు. ఆశ్రమంలో బాగో గులపై ఆరా తీశారు. కలెక్టర్ స్వయంగా వచ్చి పింఛను అందజేయడం, సదుపాయాలపై ఆరా తీయడంతో పం డుటాకుల్లో ఆనందం కనిపించింది.

పింఛన్ల పంపిణీ సాగిందిలా..

సమయం	శాతం	నగదు
3.38	0.54	0.55
5.25	6.01	6.15
11.40	89.57	91.64
12.10	91.24	93.35
02.10	93.87	96.04
03.10	94.52	96.70
06.10	96.16	98.38

శనివారం తెల్లవారుజామున 3.15 గంటలకే పింఛన్ల పంపిణీ ఆరంభించారు. సాయంత్రం 6 గంటలకు 96.34 శాతం పింఛన్లు పంపిణీ చేశారు.



పింఛన్ ఇస్తున్న మంత్రి దుర్గేష్, మాజీ ఎమ్మెల్యే శేషారావు

కూటమి పేదల ప్రభుత్వం : దుర్గేష్

నిడదవోలు, ఆగస్టు 31 : కూటమి ప్రభుత్వం పేదల పక్షపాతి ప్రభుత్వమని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీ శాఖా మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. నిడదవోలు మండలం సమిశ్రగూడెంలో శనివారం పించ న్లను పంపిణీ చేశారు.ఒకటో తేదీ ఆదివారం కావడంతో ఒకరోజు ముందుగానే పింఛన్లు పంపిణీ కార్యక్రమం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందన్నారు.సోమవారం కూడా లబ్ధి దారులకు పింఛన్లు అందజేస్తారన్నారు. మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు మాట్లాడుతూ భారీ వర్షాలను సైతం లెక్క చేయకుండా పేదలకు ఇంటి వద్ద పింఛన్లు పంపిణీ చేస్తున్నామన్నారు.

గత వైసీపీ ప్రభుత్వంలో పింఛను సమయం వచ్చిందంటే అదేదో జగన్ మాత్రమే చేస్తున్న పెద్ద క్రతువు మాదిరిగా వారం రోజుల పాటు హడావుడి, గందరగోళం కనిపించేది. వలంటీర్లు లేకుండానే.. సచివా లయ సిబ్బందితో మూడు రోజుల సమయం ఉన్నా కేవలం ఒక్క రోజులోనే నూటికి 97 మందికి పింఛను అందించడంలో కూటమి పాలకులు విజయం సాధించారు. దీంతో పండుటాకులను జగన్ ఉద్దేశపూర్వకంగానే అగచాట్లు పెట్టాడనే నిజం రుజువైంది.

ఫస్ట్ కోరుకొండ.. సెకండ్ రంగంపేట

రంగంపేట : ఎన్టీఆర్ భరోసా ఆగస్టు నెల పింఛన్లు పంపిణీలో రాజానగరం నియోజకవర్గంలోని కోరుకొండ మండలం ప్రథమస్థానంలో నిలిచింది. అనపర్తి నియోజకవర్గంలోని రంగంపేట మండలం ద్వితీయ స్థానంలో నిలిచింది. జిల్లాలో కోరుకొండ మండలం 97.62 శాతం మందికి పింఛన్లు పంపిణీ చేసి ప్రథమస్థానంలో నిలిచింది. రంగంపేట మండలంలో 8925 మంది పింఛనుదారులకు రూ.3,77,48,500లు మంజూరు కాగా మధ్యాహ్నం సమయానికే 8668 పింఛన్లు పంపిణీ చేసి జిల్లాలోనే అత్యధికంగా 97.44 శాతంతో జిల్లాలో ద్వితీయ స్థానంలో నిలిచిందన్నారు. ఆ తరువాత స్థానంలో రాజానగరం మండలం 97.28 శాతంతో మూడో స్థానంలో నిలిచింది.



కొమరిపాలెంలో పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి



కొవ్వూరులో నీట మునిగిన ఫైర్‌స్టేషన్



వీడని ముసురు..

- ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వాన
- సరాసరి 56.7 శాతం వర్షపాతం
- అత్యధికంగా పెరవలిలో 97.0 మి.మీ
- ఎక్కడికక్కడ కంట్రోల్‌రూమ్‌లు

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 31: అల్పపీడన ద్రోణి ప్రభావంతో జిల్లాలో గడచిన 24 గంటల్లో విస్తారంగా వర్షాలు పడుతున్నాయి. ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. జిల్లావ్యాప్తంగా 19 మండలాల్లో 56.7 శాతం వర్షపాతం నమోదైందని వాతవరణ శాఖ తెలిపింది. జిల్లాలో అత్యధికంగా పెరవలి మండలంలో 97 మి.మీ.. అత్యల్పంగా కోరుకొండలో 36. మి.మీ వర్షపాతం నమోదైంది. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖ అధికారి వాసుదేవరావు శనివారం పాఠశాలలకు సెలవు ప్రకటిస్తూ ఉత్తర్వులను జారీ చేశారు. జిల్లాలో 1071.4 మి.మీ వర్షం కురిసింది. నల్లజర్లలో 70.8 మి.మీ, ఉండ్రాజవరంలో 67.2 మి.మీ, అనపర్తి 66.4, బిక్కవోలులో 64.8, రంగంపేటలో 63.8 , తాళ్లపూడిలో 62.6, రాజానగరం 58.8, కడియంలో 55.2, గోకవరంలో 53.2, రాజమహేంద్రవరం రూరల్‌లో 53.2, నిడదవోలులో 52.4, దేవరపల్లిలో 51.0, రాజమహేంద్రవరంలో 49.4, గోపాలపురంలో 46.6, చాగల్లులో 45.2, కొవ్వూరులో 41.6, సీతానగరంలో 36.2 మి.మీ వర్షం కురిసింది.దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.



నల్లజర్లలో నీట మునిగిన ఆనందనిలయం పరిశీలిస్తున్న తహశీల్దార్ తదితరులు

జిల్లా వ్యాప్తంగా 22 కంట్రోల్ రూమ్‌లు

జిల్లాలో అత్యధికంగా వర్ష హెచ్చరికల నేపథ్యంలో 22 కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ నెం 8977935609 , రాజమహేంద్రవరం ఆర్డీవో కార్యాలయంలో కంట్రోల్ రూమ్ 0883-442344, కొవ్వూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ 08813-231488, రాజమహేంద్రవరం తహశీల్దార్ కార్యాలయంలో 9494662219, రాజమహేంద్రవరం రూరల్ తహశీల్దార్ కార్యాలయంలో 0883-2416005, సీతానగరం తహశీల్దారు కార్యాలయంలో 6281867443 , కోరుకొండ తహశీల్దార్ కార్యాలయంలో 9908682953 , గోకవరం తహశీల్దార్ కార్యాలయంలో 9492342353, రాజానగరం తహశీల్దారు కార్యాలయంలో 9182648034 , రంగంపేట తహశీల్దార్ కార్యాలయంలో 7095239456 , అనపర్తి తహశీల్దార్ కార్యాలయంలో 9000660657 , బిక్కవోలు తహశీల్దార్ కార్యాలయంలో 9866484845 , కడియం తహశీల్దార్ కార్యాలయంలో 7659066699 , కొవ్వూరు తహశీల్దార్ కార్యాలయంలో 7981029003 , తాళ్లపూడి తహశీల్దార్ కార్యాలయంలో 7569770487 , చాగల్లు తహశీల్దార్ కార్యాలయంలో 9676634787, నిడదవోలు తహశీల్దార్ కార్యాలయంలో 9676253740, ఉండ్రాజవరం తహశీల్దార్ కార్యాలయంలో 9493306893, పెరవలి తహశీల్దార్ కార్యాలయంలో 9849172014, గోపాలపురం తహశీల్దార్ కార్యాలయంలో 7337521367 , దేవరపల్లి తహశీల్దార్ కార్యాలయంలో 9705818045 ,నల్లజర్ల తహశీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నెం 9505132306 నెంబర్లకు వర్షం అధికం కావడం వల్లన ఎదైన సమ్యలు ఏర్పడితే సమాచారం ఇవ్వాలని కలెక్టర్ తెలిపారు.

సైబర్ క్రైమ్‌పై అవగాహన ఉండాలి

నిడదవోలు, ఆగస్టు 31: మొబైల్ ఫోన్ వినియోగించే మహిళలంతా అపరిచిత కాల్స్, ఆన్‌లైన్ షాపింగ్ పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ శోభన్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో సైబర్ క్రైమ్‌పై న్విహించిన అవగాహన సదస్సుకు ఆయన విచ్చేసి మాట్లాడారు. మొబైల్స్‌కు వచ్చే లింకులను క్లిక్ చేయకూడదని, ఆన్‌లైన్ షాపింగ్‌కు వచ్చే ఓటీపీలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

అగ్నిమాపక రాష్ట్ర స్పోర్ట్స్, కల్చరల్ సెక్రటరీగా గణేష్


గణేష్‌ను అభినందిస్తున్న సిబ్బంది

నిడదవోలు, ఆగస్టు 31: నిడదవోలు అగ్నిమాపక శాఖ కేంద్రంలో ఫైర్ మెన్‌గా పనిచేస్తున్న ఎమ్.సప్తగిరి గణేష్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అగ్నిమాపక శాఖ అసోసియేషన్ జనరల్ ఎలక్షన్‌లో స్టేట్స్ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగాను, తణుకు అగ్ని మాపక కేంద్రంలో ఫైర్‌మెన్‌గా పనిచేస్తున్న పవి సత్యనారాయణ స్టేట్ ట్రెజరర్‌గా ఎన్నికయ్యారు. వీరిని నిడదవోలు అగ్నిమాపక కేంద్ర సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి శ్రీ.శ్రీనివాసరావు, సిబ్బంది అభినందించారు.

సీజనల్ వ్యాధులతో నిర్లక్ష్యం తగదు

కొవ్వూరు, ఆగస్టు 31: అధిక వర్షాల కారణంగా వ్యాప్తి చెందుతున్న సీజనల్ వ్యాధుల పట్ల నిర్లక్ష్యం తగదని దొమ్మేరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎస్.ధర్మరాజు అన్నారు. మండలంలోని కాపవరంలో శనివారం మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశారు. 36మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, జ్వరాలతో బాధపడుతున్న ఐదుగురి నుంచి రక్త నమూనాలు సేకరించారు. ఇంటింటికీ వెళ్లి ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని అవగాహన కలిగించారు.

గణేష్ ఉత్సవాలకు అనుమతి తప్పనిసరి

ఉండ్రాజవరం, ఆగస్టు 31: వినాయకచవితి ఉత్సవాల నిర్వహణకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్ఐ జి.శ్రీనివాసరావు శనివారం తెలిపారు. ఉత్సవ విగ్రహాలను రోడ్ల పక్కన ట్రాఫిక్‌నకు అంతరాయం లేకుండా ఏర్పాటు చేసుకోవాలని, స్పీకర్లను ఉదయం 6గంటల నుంచి రాత్రి 10గంటల వరకే ఉంచాలని, ఎక్కువ శబ్దకాలుష్యం లేకుండా పెట్టుకోవాలని చెప్పారు. విగ్రహాలను నిమజ్జనం చేసే సమయంలో పోలీసువారికి ముందుగా తెలియజేసి, ట్రాఫిక్‌నకు ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్ఐ చెప్పారు.

దమ్మెన్నులో సివిల్ రైట్స్ డే

ఉండ్రాజవరం, ఆగస్టు 31: మండలంలోని దమ్మెన్ను గ్రామంలో శనివారం సివిల్ రైట్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ చట్టాలను గురించి అధికారులు ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో డీటీ హరిప్రసాద్, సర్పంచ్ జి.సత్యనారాయణ, వీఆర్వో టి.శ్రీనివాస్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు

దేవర పల్లి, ఆగస్టు 31: స్థానిక ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో శనివారం సామూహిక పూజలు, మృత్యుంజయ హోమం నిర్వహించారు. శ్రావణ మాసం శనిత్రయోదశి పర్వదినం కావడంతో స్వామికి ప్రత్యేక అభిషేకాలు, కుంకుమపూజలు చేశారు. ఆలయార్చకుల ఆధ్వర్యంలో 108మంది దంపతులు ఈ పూజా కార్యక్రమాలు చేపట్టారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఆహ్లాదం కనుమరుగు

మొక్కలు నాటండి.. వాటిని సంరక్షించండి అంటూ అటు నాయకులు ఇటు అధికారులు వనమహోత్సవంలో భాగంగా పిలుపునిస్తున్నారు.. అయితే కళ్లెదుట పచ్చదనం కనమరుగవుతున్నా అటు వైపు చూసే నాథులే కరువయ్యారు. ఇదెక్కడో మారుమూల కాదు.. అందరికీ తెలిసిన కొవ్వూరు గోష్పాద క్షేత్రం ఆవరణలో ఉన్న సుందరీకరణ పార్క్ పరిస్థితి. గత టీడీపీ ప్రభుత్వం రూ.25 కోట్లతో ఎంతో ఆహ్లాదంగా తీర్చిదిద్దిన పార్క్ గత పాలకుల నిర్లక్ష్యంతో నేడు అధ్వానంగా తయారైంది.


మరమ్మతులకు గురైన ఆట వస్తువులు


సుందరీకరణ పార్క్‌లో పెరిగిన పిచ్చిమొక్కలు, తుప్పలు

- చిట్టడవిలా కొవ్వూరు సుందరీకరణ పార్క్
- మట్టిలో కలిసిపోతున్న రూ.25 కోట్లు
- డంపింగ్‌యార్డుగా మార్చిన వైనం
- అధ్వానంగా తయారైన ప్రాంగణం
- పగిలిపోయిన విద్యుద్దీపాలు
- రాత్రుళ్లు అసాంఘిక కార్యకలాపాలు
- విషపురుగులు, పాముల సంచారం
- మరమ్మతులకు గురైన ఆట వస్తువులు

కొవ్వూరు, ఆగస్టు 31: అఖండ గోదావరి పుష్కరాల సందర్భంగా కొవ్వూరులో గోదావరి ఏటిగట్టు రోడ్డును పర్యాటకంగా అభివృద్ధి చేయాలని ఆనాటి టీడీపీ ప్రభుత్వం సంకల్పించింది. 2003 గోదావరి పుష్కరాల సమయంలో కొవ్వూరు రోడ్డు కం రైలు బ్రిడ్జి టోల్‌గేటు సెంటరు నుంచి గోదావరిమాత విగ్రహం వరకు సుందరీకరణ పనులు చేపట్టారు. మరలా 2015 పుష్కరాలకు సుందరీకరణ పనులను తాళ్లపూడి రోడ్‌లో గామన్ బ్రిడ్జి వరకు పొడిగించారు. ఈ రెండు పుష్కరాళ్ల సమయాల్లో సుమారు రూ.25 కోట్లతో రోడ్డు కం రైలు బ్రిడ్జి నుంచి గామన్‌బ్రిడ్జి వరకు గోదావరి ఏటిగట్టుపై రెండువైపులా కాంక్రీట్ గోడలు నిర్మించారు. గోడలపై ఇనుపజాలీలను ఏర్పాటుచేసి మధ్యలో సప్త మహర్షుల విగ్రహాలు, వాకింగ్ ట్రాక్, పూలమొక్కలు వేసి పర్యాటకంగా అభివృద్ధి చేసి సుందరీకరించారు. అలాగే పట్టణ ప్రజలు వాకింగ్ చేసుకోవడానికి ట్రాక్ ఏర్పాటుచేశారు. ఆధ్యాత్మిక, ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకునే విధంగా గోదావరి గట్టును సుందరీకరించారు.

గాలికొదిలేసిన వైసీపీ ప్రభుత్వం

అయితే మున్సిపాల్టీకి పార్క్ నిర్వహణ భారంగా మారడం, ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం సుందరీకరణ బండ్‌ను పట్టించుకోకపోవడంతో ఆహ్లాదాన్ని పంచవలసిన బండ్ చిట్టడవిని తలపిస్తోంది. పచ్చదనం మొత్తం ఆవిరి అయిపోయింది. విషపురుగులు, పాములకు నిలయమై ప్రజలు పార్క్‌లోకి వెళ్లాలంటే భయాందోళన చెందుతున్నారు. మరోవైపు ఇనుపజాలీలు విరిగిపోవడం, గోడలు బీటలు వారి పడిపోతున్నాయి. ఆకతాయిల విద్యుత్ దీపాలను పగలగొట్టి విద్యుత్ తీగలను దొంగిలించడంతో ఏటిగట్టు మొత్తం అంధకారం అలుముకుంటోంది. గోడలపై ఉన్న ఇనుపజాలీలను కొంతమంది విరగగొట్టి లోపలికి ప్రవేశించి, రాత్రి సమయాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. వ్యాయామ పరికరాలు, పిల్లల కోసం ఏర్పాటుచేసిన ఆట వస్తువులు, ఉయ్యాలలు తుప్పుబట్టి మరమ్మతులకు గురవుతున్నాయి. గామన్‌బ్రిడ్జి వద్ద నుంచి రాంచీలరేవు వరకు సమీప ప్రాంతాల్లోని ప్రజలు రోజులవారి చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను తీసుకువచ్చి పార్క్‌ను కాస్తా డంపింగ్ యార్డు మార్చివేశారు.

పిచ్చిమొక్కలు, తుప్పలు

గోదావరి బండ్‌పై ఉన్న సుందరీకరణ పార్క్‌ను వివేకానంద, అంబేడ్కర్, గౌతమ మహర్షి, ఎన్టీఆర్, అల్లూరి సీతారామరాజు వంటి మహనీయుల పేర్లతో పార్క్‌లుగా విభజించారు. ఆ పార్కుల్లో రూ.2.20 కోట్లతో వ్యాయామ పరికరాలు, పిల్లలు ఆడుకోవడానికి ఆట వస్తువులు ఏర్పాటుచేశారు. కొంతకాలం బాగానే ఉన్నప్పటికీ తోటమాలి, నైట్‌వాచ్‌మేన్‌ను ఏర్పాటుచేయకపోవడంతో పార్క్‌లో పిచ్చిమొక్కలు, తుప్పలు ఏపుగా పెరిగి చిట్టడవిలా తయారైంది. విషపురుగుల సంచరిస్తున్నాయని ప్రజలు పార్క్‌లోకి రావడం మానేశారు. భక్తాంజనేయ స్నానఘట్టం నుంచి రోడ్డు కం రైలు బ్రిడ్జి వరకు కాగితం పువ్వులు, ఇతర ముళ్ల చెట్టుకొమ్మలు ఏపుగా పెరిగి సుందరీకరణ పార్క్ గోడలు దాటి బయటకు వచ్చేశాయి. ద్విచక్ర వాహనంపై కూర్చున్నవారికి చెట్టు కొమ్మలు కళ్లలలో గుచ్చుకుని గాయాలపాలవుతున్నారు. కొవ్వూరు నుంచి రాజమహేంద్రవరం ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వారికి ఈ చెట్టు కొమ్మలు తగిలి ప్రమాదాలకు గురవుతున్నారు.

బండ్ మొత్తం పర్యవేక్షించాలి: పట్టణస్థులు

కాగా గోదావరి బండ్ మొత్తం అధ్వానంగా తయారైందని, దానిని పర్యవేక్షించేందుకు తోటమాలిని, నైట్ వాచ్‌మేన్‌లను ఏర్పాటు చేయాలని పట్టణవాసులు కోరుతున్నారు. నిర్వహణ ఖర్చును తగ్గించుకునేందుకు లాంచీలరేవు, గోష్పాదక్షేత్రం, టోల్‌గేట్, సుబ్రహ్మణ్య స్నానఘట్టాల వద్ద అద్దె ప్రాతిపదికన మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మిస్తే మున్సిపాల్టీకి కొంత భారం తగ్గడంతో పాటు ఆదాయం సమకూరుతుందని సూచిస్తున్నారు.

ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

కొవ్వూరు గోదావరి గట్టుపై ఉన్న సుందరీకరణ పార్క్‌లో ఏపుగా పెరిగిన మొక్కలను తొలగించి, ప్రజలకు ఆహ్లాదాన్ని అందించేలా తీర్చిదిద్దేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి అందించాలని మున్సిపల్ ఏఈలను ఆదేశించాం. పాలకవర్గ ఆమోదంతో ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేలా పార్క్‌ను తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

-కె.డానియేల్ జోసఫ్, మున్సిపల్ కమిషనర్.

పార్క్ నిర్వహణపై ఎమ్మెల్యే ముప్పిడి అసంతృప్తి

ఇటీవల కౌన్సిల్ సమావేశానికి విచ్చేసిన ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు సుందరీకరణ పార్క్ నిర్వహణ పట్ల అసంతృప్తి వ్యక్తపరిచారు. పుష్కరాల సమయంలో యాత్రికులకు ఆహ్లాదాన్ని పంచిన సుందరీకరణ పార్క్‌లో పిచ్చిమొక్కలు, తుప్పలు పెరిగిపోయి అధ్వానంగా ఉందన్నారు. తుప్పలు, పిచ్చిమొక్కలను తొలగించి కడియం నర్సరీల నుంచి ప్రజలకు ఆహ్లాదాన్ని పంచే పూలమొక్కలను నాటి సుందరంగా తీర్చి దిద్దాలన్నారు. 2027లో జరిగే గోదావరి పుష్కరాల నాటికి పార్క్‌ను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలని మున్సిపల్ పాలకవర్గం, అధికారులకు సూచించారు.


సుందరీకరణ పార్క్ నుంచి ప్రమాదకరంగా బయటకు వచ్చిన మొక్కలు

పేదలకు ఆసరా పింఛన్లు

- పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్
- జోరు వానలోనూ లబ్ధిదారులకు పెన్షన్ల పంపిణీ


కొవ్వూరు ఇందిరమ్మకాలనీలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి


తాళ్లపూడిలో పంపిణీ చేస్తున్న ఎంపీడీవో వెంకటరమణ

కొవ్వూరు/చాగల్లు: కొవ్వూరులోని ఇందిరమ్మకాలనీ, కొవ్వూరు మండలం ధర్మవరం, చాగల్లు మండలం బ్రహ్మణగూడెంలో ఎన్టీఆర్ భరోసా సామాజిక పించన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ప్రారంభించారు. శనివారం తెల్లవారుజాము నుంచి ఎడతెరిపి లేకుండా జోరు వర్షం కురుస్తున్నప్పటికీ లెక్కచేయకుండా అధికార యం త్రాంగం ఇంటింటికీ వెళ్లి పించన్లు పంపిణీ చేశారు. పట్టణంలో 3970 మంది పింఛనుదారులకు రూ.1,72,13, 500 పంపిణీకి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని మున్సిపల్ కమిషనర్ డానియల్ జో సఫ్ తెలిపారు. అలాగే మండలంలోని 16 గ్రామాల్లో 10,211 మంది పింఛనుదారులకు రూ.4, 31,52,000 పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని ఎం పీడీవో కె.సుశీల తెలిపారు. కాగా చాగల్లు మండలంలో 95 శాతం పైగా పిం ఛన్లు పంపిణీ చేశామని ఎంపీడీవో నిర్మలాకుమారి తెలిపారు.కార్యక్ర మంలో ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కంటమణి రామకృష్ణారావు, జనసేన ఇన్‌చార్జి టీవీ రామారావు, దాయన రామకృష్ణ, సూర్యదేవర రంజిత్, బోడపాటి ముత్యాలరావు, మడిచర్ల రామచంద్రరావు, కౌన్సిలర్ కె.వెంకటలక్ష్మి, వై. వీరభద్రరావు, చిట్టిబాబు, మరపట్ల కళాధర్ పాల్గొన్నారు. బ్రాహ్మణగూడెంలో టీడీపీ నాయకులు నాదెళ్ల శ్రీరామ్, ప్రత్తిపాటి వెంకటేశ్వరరావు, గారపాటి పెద్దశ్రీను పాల్గొన్నారు.


నల్లజర్ల: ప్రకాశరావుపాలెంలో పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి


ఉండ్రాజవరం: కె.సావరంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న మంత్రి దుర్గేష్

నల్లజర్ల: మండలంలోని ప్రకాశరావుపాలెంలో జరిగిన ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు స్వయంగా పాల్గొని లబ్ధిదారులకు పింఛన్ అందించారు. అలాగే అన్ని గ్రామాల్లో ఉద్యోగులు పింఛను పంపిణీ కార్యక్రమంలో పాల్గొని వేగంగా పంపిణీ చేశారు. మండలంలో 96శాతం పింఛన్ పంపిణీ చేసినట్లు ఇన్‌చార్జీ ఎంపీడీవో సింహాద్రిరావు తెలిపారు.

తాళ్లపూడి: మండలంలో పించన్ల పంపిణీ 95శాతం జరిగిందని, ఉదయం 5 గంటల నుంచే సచివాలయ సిబ్బంది తమకు కేటాయించిన ప్రదేశాల్లో పించన్ల పంపిణీ ప్రారంభించారని ఎంపీడీవో వెంకటరమణ తెలిపారు. మండల ప్రత్యేకాధికారి, డీపీవో డి.రాంబాబు పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీడీవోతోపాటు ఏఎస్‌వో జోడాల రెవెన్యూ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, కూటమి నాయకులు పాల్గొన్నారు. మండలంలో 7897 మంది లబ్ధిదారులకు గానూ 7518 మందికి పంపిణీ చేసినట్టు ఎంపీడీవో చెప్పారు.

ఉండ్రాజవరం/పెరవలి, ఆగస్టు 31: ప్రభుత్వం అందించే పింఛన్లు పేదలకు ఆసరాగా ఉన్నాయని పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. శనివారం ఉండ్రాజవరం మండలం కె.సావరం, పెరవలి మండలం ఖండవల్లి గ్రామాల్లో మంత్రి దుర్గేష్, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ ప్రభుత్వానికి ఎన్ని ఇబ్బందులు ఉన్నప్పటికీ సకాలంలో పింఛన్లు అందజేయాలనే ఉద్దేశ్యంతో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ పట్టుదలతో పనిచేస్తున్నారన్నారు. ప్రభుత్వం పింఛను ద్వారా లబ్ధిదారునికి భరోసా కల్పిస్తోందని, పేదల అభ్యున్నతి కోసం పింఛనుదారులకు రూ.వెయ్యి పెంచి వారి సంక్షేమానికి కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన మండలాధ్యక్షులు సింహాద్రి రామకృష్ణ, వీరమళ్ల బాలాజీ పాల్గొనగా ఖండవల్లిలో భూపతిరాజు రవివర్మ, అతికాల శ్రీను, పులిదిండి నాగరాజు, వనచర్ల దివ్య, కడలి సత్యనారాయణ, రెడ్డి సత్యనారాయణ, మంగం రామారావు, బొడ్డు రామాంజనేయులు పాల్గొన్నారు.

పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలి

గోపాలపురం, ఆగస్టు 31: సీపీఎస్ యూపీఎస్‌లను వ్యతిరేకిస్తూ పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని ఈ నెల 1న చేపట్టే నిరసన కార్యక్రమానికి ఉపాధ్యాయులు తరలి రావాలని ఏపీటీఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు కొండేపాటి శ్రీనివాస్, సనపల రాజశేఖర్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కొవ్వూరు సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద మధ్యాహ్నం 2గంటలకు నిరసన ప్రదర్శన నిర్వహిస్తామన్నారు. నూతన ప్రభుత్వాలు అమలు చేస్తున్న పింఛన్ విధానం ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు ఆమోద యోగ్యం కాదని ఏపీటీఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిర్వహిస్తున్న ఈ నిరసన కార్యక్రమానికి ఉద్యోగులు, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు.

నీట మునిగిన ఆనంద నిలయం

నల్లజర్ల, ఆగస్టు 31: మండలంలో రెండు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. శనివారం నల్లజర్లలోని ఆనంద నిలయం వరద నీటికి ముంపుకు గురికావడంతో విద్యార్థులను హైస్కూల్‌కి తరలించాలని తహశీల్దార్ కృష్ణారావు, ఎంపీడీవో సింహాద్రిరావు ఆదేశించారు. భోజనాల అనంతరం విద్యార్థులను వార్డెన్ ధర్మయ్య సురక్షిత ప్రాంతానికి తరలించారు.

సేవా దృక్పథంతో పని చేస్తేనే గుర్తింపు



నల్లజర్ల, ఆగస్టు 31: విధి నిర్వహణలో సేవ దృక్పథంతో పని చేసే ప్రతి ఉద్యోగి పదవి విరమణ తర్వాత కూడా ప్రజల హృదయాల్లో నిలిచి పోతారని విద్యుత్ శాఖ అధికారులు వినయకుమార్, అమ్మిరాజు అన్నారు. నల్లజర్ల సబ్‌స్టేషన్‌లో వాచ్‌వార్డ్‌గా పనిచేస్తున్న వైబీ శ్రీనివాసరావు పదవి విరమణ సభ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నల్లజర్ల సబ్‌స్టేషన్‌లో 18 ఏళ్లుగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో లైన్ ఇనెస్పెక్టరు ఈదా డేవిడ్, యూనియన్ నాయకులు తాళ్లూరి శ్రీనివాస్, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కొవ్వూరు, ఆగస్టు 31: పురుగులు మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందినట్టు హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ తెలిపారు. కాకినాడ జిల్లా తుని మండలం జిల్లేడుపాడుకు చెందిన పిచ్చెల్లి సాయి(23), అదే గ్రామానికి చెందిన వివాహిత గంగభవాని, ఆమె పిల్లలతో కలిసి ఈ నెల 24న విజయవాడ వచ్చారు. ఇద్దరు కలిసి తిరుగు ప్రయాణమయ్యారు. గంగభవాని పిల్లలతో వెళ్లిపోవడంతో మనస్తాపం చెందిన సాయి ఈ నెల 25వ తేదీ ఉదయం గామన్‌బ్రిడ్జి టోల్‌గేటు వద్ద గడ్డి మందు తాగి పడిపోయాడు. స్థానికులు గమనించి 108 అంబులెన్స్‌లో రాజమహేంద్రవరం, అక్కడి నుంచి కాకినాడ ఆసుపత్రులకు తరలించారు. వైద్యం పొందుతూ శనివారం సాయి మృతి చెందాడు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్టు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

'జనసేవక్' ఆర్థిక సహాయం

ఉండ్రాజవరం, ఆగస్టు 31: రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వ్యక్తి కుటుంబానికి మండలంలోని కె.సావరం గ్రామానికి చెందిన జనసేవక్ ఫౌండేషన్ సంస్థ ఆర్థిక సాయం అందజేసింది. ఇరగవరం మండలం తూర్పువిప్పర్రు గ్రామానికి చెందిన కర్రి సత్యనారాయణ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతూ మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబానికి శనివారం వారి ఇంటి వద్ద రూ.22,660 తమ ఫౌండేషన్ తరపున సహాయం అందజేసినట్టు సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో మీసాల సురేష్, నార్ని దుర్గారావు, వర్రే రమేష్, బసవా రాజారత్నం, నార్ని వీరవెంకట్రావు, నాగిరెడ్డి నాని తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటుకే ఓకే..

- మద్యం షాపులకు 15న నోటిఫికేషన్
- వచ్చే నెల 1 నుంచి కొత్త విధానం!
- నాలుగైదు రోజుల్లో 'జె' బ్రాండ్లకు స్వస్తి



రాజమహేంద్రవరం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో త్వరలో ప్రైవేటు షాపుల్లో మద్యం అమ్మకాలు ప్రారంభించనున్నారు. జగన్ పిచ్చి బ్రాండ్లకు, నాసిరకం మద్యానికి పూర్తిగా స్వస్తి చెప్పి కొత్త మద్యం విధానం తీసుకొచ్చే ప్రక్రియను కూటమి ప్రభుత్వం వేగంగా చేస్తోంది. ఈ క్రమంలో నాలుగైదు రోజుల్లో ఎంసీ, సియాగ్రామ్స్ వంటి మల్టీ నేషనల్ కంపెనీలకు చెందిన ఎంసీ బ్రాండ్రీ, విస్కీ, ఐబీ విస్కీ, నాకౌట్, ఖజురహో బీర్లు తదితర బ్రాండ్ల సరుకు మార్కెట్లోకి వచ్చే అవకాశం కనిపిస్తోంది. ఇప్పటికే వీటి సరఫరాకు ఆయా కంపెనీలకు ఇండెంట్లు వెళ్లాయి. ఇక కొత్త మద్యం పాలసీపై నోటిఫికేషన్ ఈ నెల 15న విడుదల అవుతుందని చెబుతున్నారు. 25కి ప్రక్రియ పూర్తి చేసి 30 నాటికి ప్రైవేటు షాపుల్లో అమ్మకాలు ప్రారంభించనున్నారు. అక్టోబరు 1 నుంచి ప్రభుత్వ మద్యం దుకాణాలు, జగన్ పిచ్చి బ్రాండ్లు కనుమరుగు అవుతాయనే చర్చ నడుస్తోంది. ధరలు కూడా దిగిరానున్నాయి. రూ.120కే రెండు మూడు మంచి బ్రాండ్ల మద్యం అందుబాటులోకి రానుందని తెలుస్తోంది. నాణ్యమైన చీప్ లిక్కర్‌కి రూ.100లోపే ధర నిర్ణయిస్తారని సమాచారం. అయితే ప్రస్తుతం ఉన్న బార్ల యాజమాన్యాలు, ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న సిబ్బందితో కాస్త ఇబ్బంది తలెత్తే అవకాశం ఉంది. ఇప్పటికే ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు 7న రాష్ట్ర వ్యాప్తంగా షాపులు మూసేసి ధర్నా చేయడానికి పిలుపునిచ్చారు. జగన్ ప్రభుత్వంలో మద్యం ధరలు అమాంతం పెరిగిన విషయం తెలిసిందే. దానికితోడు బార్లలో క్వార్టరుపై సుమారు రూ.80 వరకూ, బీరుపై రూ.100-130 వరకూ అదనంగా వసూలు చేస్తున్నారు. ప్రైవేటు షాపులు, పర్మిట్ రూంలు వస్తే ఈ విధానం కుదరదు. పైగా ప్రైవేటు షాపుల్లో అన్ని బ్రాండ్లూ అందుబాటులో ఉంటాయి. దీంతో ప్రస్తుతం కొనసాగుతున్న బార్లకు మందుబాబులు వెళ్లే పరిస్థితి ఉండదు. వీటికి లైసెన్సులు జారీ చేసి ఇప్పటికే ఏడాది గడిచింది. రెండో ఏడాది మొదలు కావడంతో లైసెన్సు ఫీజు చెల్లించాల్సి ఉంది. అయితే నిడదవోలులోని రెండు బార్లు ఫీజు చెల్లించలేదు. ఏది ఏమైనా మందుబాబులకు ఇచ్చిన మాట నెరవేర్చే పనిలో కూటమి ప్రభుత్వం ఉంది.

లాటరీ తగిలిందంటూ అపరిచితుడి ఫోన్

- పోలీసులను ఆశ్రయించిన హోటల్ కార్మికుడు


సైబర్‌నేరాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ విశ్వం

కొవ్వూరు, ఆగస్టు 31: ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని, లేకుంటే సర్వం కోల్పోవలసి వస్తుందని సీఐ పి.విశ్వం చెప్పారు. కొవ్వూరు మండలం వేములూరు గ్రామానికి చెందిన హోటల్ కార్మికుడు నూలు వెంకటరమణ ఆన్‌లైన్‌లో లాటరీ టిక్కెట్ కొనుగోలు చేశాడు. ఇది తెలుసుకున్న సైబర్ నేరగాడు వెంకటరమణకు ఫోన్‌చేసి తాను స్టేట్‌బ్యాంకు మేనేజర్‌నని చెప్పి మీకు రూ.11,78,000 లాటరీ తగిలింది. ఆ సొమ్ము మీ ఖాతాలో వేస్తాను అకౌంట్ నెంబరు ఇవ్వమని అడగగా వెంకటరమణకు ఇచ్చాడు. మీ అకౌంట్ సేవింగ్ ఖాతా కావడంతో డబ్బు జమ కావడానికి ఆలస్యమవుతుందని, మీరు రూ.11,780 చెల్లించాలని క్యూర్ కోడ్ పంపించాడు. మీరు ఇచ్చే అమౌంట్‌లో తగ్గించుకుని మిగిలిన డబ్బు ఇవ్వాలని వెంకటరమణ చెప్పడంతో అలా కుదరదని మీ డబ్బు మీ అకౌంట్‌కి వేసేశాం. మీరు క్యూర్ కోడ్ స్కాన్‌చేసి డబ్బు పంపించాలని అనడంతో వెంకటరమణ పట్టణ పోలీసులను ఆశ్రయించాడు. సీఐ విశ్వం వెంకటరమణ వద్ద సెల్ నంబరు తీసుకుని అగంతకునితో మాట్లాడుతుండగా ఫోన్ కట్ చేశాడు. దీనిపై సీఐ మాట్లాడుతూ వారంతా ఎక్కడుంటారో, ఏం చేస్తుంటారో తెలియదని, ఆన్‌లైన్‌లో లాటరీ వచ్చిందని, ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించి మోసం చేస్తున్న వారి సంఖ్య రోజురోజుకి పెరుగుతుందన్నారు. సైబర్ నేరగాళ్లు ఆన్‌లైన్ యాప్‌ల ద్వారా మోసాలకు పాల్పడుతూ భారీగా డబ్బులు దోచేస్తున్నారన్నారు. ఉద్యోగం ఇప్పిస్తామని, విదేశాలకు పంపిస్తామని, లాటరీ వచ్చిందని, బ్యాంకు ఖాతా ఈకేవైసీ చేసుకోవాలని అమాయకులను మోసం చేస్తున్నారన్నారు. వెంకటరావును డబ్బు చెల్లించాలని అడిగిన వెంటనే పోలీసుస్టేషన్‌కు వచ్చి సమాచారం అందించడంతో సీఐ విశ్వం సైబర్ నేరగాళ్లపై అవగాహన కల్పించి పంపించారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు

పెరవలి, ఆగస్టు 31: ప్రస్తుత వాతావరణ పరిస్థితులు కారణంగా గ్రామాల్లో జ్వరాలు ఎక్కువగా ఉన్నందు వల్ల పెరవలి ఆరోగ్య కేంద్ర పరిధిలోని గ్రామాల్లో ప్రత్యేక వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్టు ఆసుపత్రి వైద్యులు విజయకుమార్, కృష్ణవేణి తెలిపారు. ఆయా గ్రామాల్లో ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి సర్వే చేసి జ్వరం కేసులుంటే తగిన మందులు ఇంటి వద్దనే అందజేస్తున్నామన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమలు లేకుండా చూసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ముక్కామల, అజ్జరం, అన్నవరప్పాడులో వైద్య శిబిరాలు నిర్వహించారు.

లోతట్టు ప్రాంతాలు జలమయం

కొవ్వూరు /పెరవలి, ఆగస్టు 31 : బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం అల్పపీడనంగా బలపడడంతో గడచిన 24 గంటలుగా కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కొవ్వూరు పట్టణ, మండలం, పెరవలి మండలంలో రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా ముసురు పట్టుకుంది. ఏకధాటిగా వర్షం కురవడంతో ప్రజలు ఇంటికే పరిమితమయ్యారు. రహదారి గుంతలు, పల్లపు ప్రాంతాల్లో వర్షపునీరు చేరి వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. మురుగుకాలువలు పొంగి రోడ్లపై ప్రవహిస్తున్నాయి. కొవ్వూరు ఫైర్ స్టేషన్ ప్రాంగణం, కోర్టు, పోలీస్టేషన్‌కు వెళ్లేమార్గాలు వర్షపునీటితో నిండిపోయాయి. పెరవలి మండలం తీపర్రు, కాకరపర్రు, ఖండవల్లి, పెరవలి గ్రామాల్లో పల్లపు కాలనీల్లో నీరు చేరి కాలనీ వాసులు ఇబ్బందులకు గురవుతున్నారు.

అధికారుల తీరుపై ఆగ్రహం

ఏకధాటిగా వర్షం కురుస్తున్నప్పటికీ పాఠశాలలకు సెలవు ప్రకటించడంలో అధికారులు ఆలస్యం చేయడంతో విద్యార్థులు వర్షంలో తడుస్తూనే పాఠశాలలకు వెళ్లారు. తీరా వెళ్లాకా వర్షం కారణంగా పాఠశాలలకు సెలవు ప్రకటించారని విద్యాశాఖ అధికారుల నుంచి సమాచారం రావడంతో అదే వర్షంలో తల్లిదండ్రులు, చిన్నారులు వెనుదిరిగారు. భారీ వర్షం వస్తుందని సమాచారం తెలిసి కూడా విద్యార్థులు వర్షంలో తడుస్తూ పాఠశాలలకు వచ్చిన తర్వాత సెలవు ప్రకటించడంతో తల్లిదండ్రులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


కొవ్వూరు పోలీస్టేషన్ దారిలో వర్షం నీరు

సినిమా గైడ్

కొవ్వూరు

యువరాజ్‌మాల్ స్క్రీన్ 1	సరిపోదా శనివారం
వై.స్క్రీన్2	డిమోంటి
దేవిశ్రీ(గాయత్రి)	మారుతీ నగర్ సుబ్రహ్మణ్యం
అనన్య	కమిటీ కుర్రోళ్లు

నిడదవోలు

వీ మ్యాక్స్	డిమాంట్ కాలనీ
రాధాకృష్ణ	తంగలన్
శ్రీగణపతి	ఆయ్, కమిటీ కుర్రోళ్లు

దేవరపల్లి

శ్రీరామ్‌నాథ్ సినీ మ్యాక్స్	మిస్టర్ బచ్చన్
త్రినాథ్ సినీ మ్యాక్స్	డబుల్ ఇస్మార్ట్